Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

## కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు
• స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు
• మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 274 | హైదరాబాద్ | మంగళవారం 18 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



# రేవంత్ దూకుడు!

## బీఆర్ఎస్ టార్గెట్‌గా విమర్శలు

### వరుస సభలతో జనంలోకి.. మొన్న సంగారెడ్డి.. నిన్న వరంగల్..

### నేడు టీమ్స్ ప్రారంభం.. గులాబీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సీఎం

### సోషల్‌మీడియాలోనే బీఆర్ఎస్

సీఎం రేవంత్‌రెడ్డి కొన్ని రోజులుగా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ అంతర్గతంగా అసమ్మతి రేగుతున్నా.. దానిని పార్టీ పెద్దలకు వదిలేసి కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన మళ్లీ దూకుడు పెంచారు.

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శల వర్షం కురిపిస్తున్నారు. మొన్న సంగారెడ్డిలో.. నిన్న పాత వరంగల్ జిల్లా పరిధిలో.. సోమవారం హైదరాబాద్ నడిబొడ్డున టీమ్స్ ఆస్పత్రి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికలకు ఇంకా రెండేళ్లకు పైగా సమయం ఉండగా, సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం ఇప్పటి నుంచే ప్రత్యక్షంగా జనం మధ్యంలో ఉండేందుకు ఎక్కువ ఇష్టపడుతున్నారు. అందులో భాగంగా వారంలో రెండు మూడు బహిరంగ సభలు లేదా ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొంటూ నేరుగా ప్రజా బాహుళ్యంలోకి వెళ్తున్నారు. రేవంత్ ప్రసంగాలు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాలకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్ డైలాగ్‌లు, వైరల్ స్టేట్‌మెంట్లతో బీఆర్ఎస్‌ను ఎండగట్టేలా ఉంటున్నాయి. అఘోరాలతో క్షుద్ర పూజలు చేయిస్తున్నారు, బీఆర్ఎస్ నాయకుల రక్తాన్ని కూడా అమ్ముకుంటున్నారు వంటి తీవ్రమైన, వివాదాస్పద ఆరోపణలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. మాజీ సీఎం

- మిగతా 2వ పేజీలో



# రాజకీయ కక్షతోనే టీమ్స్ ప్రారంభంలో జాప్యం

## అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌ను కూడా అందుబాటులోకి తేవాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాతీర్పు)

కేసీఆర్‌కు పేరొస్తుందన్న రాజకీయ కక్షతోనే టిమ్స్ ఆస్పత్రులను ఇన్నాళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇప్పటికైనా బుద్ధితెచ్చుకుని అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్‌ను కూడా త్వరగా ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. పేదవారికి

- మిగతా 2వ పేజీలో



# జేఎస్ఎస్సీ పరీక్షలు రద్దు

## విద్యార్థుల దీక్షకు దిగొచ్చిన జార్ఖండ్ ప్రభుత్వం

### పారదర్శకంగా పరీక్షలు నిర్వహిస్తాం: ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్

రాంచీ, ఆగస్టు 17

పోటీ పరీక్షల రద్దు కోసం రాంచీలో విద్యార్థులు చేపడుతున్న ఉద్యమానికి అక్కడి ప్రభుత్వం దిగివచ్చింది. జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిటీ (జేఎస్ఎస్సీ) సీజీఎల్ పరీక్షలను రద్దు చూస్తూ సోమవారం రాత్రి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్

- మిగతా 2వ పేజీలో



# 6 నెలలకో ఆస్పత్రి

## 2027 డిసెంబరు నాటికి అందుబాటులోకి ఉస్మానియా, ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్ హాస్పిటళ్లు

- భారాస హయాంలోనే టిమ్స్‌లను కట్టి ఉంటే ప్రారంభించే సమయం దొరకలేదా
- వైద్యం కోసం రూ.21,800 కోట్లు ఖర్చు చేశాం
- సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో రేవంత్‌రెడ్డి

'ఉస్మానియా జనరల్ ఆసుపత్రి, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వేగంగా చేపట్టి ప్రతి ఆరు నెలలకొకటి చొప్పున ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. 2027 డిసెంబరులోపు అన్నింటినీ పూర్తి చేస్తాం.

హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాతీర్పు)

వీటి ద్వారా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో 10 వేల పడకలు సమకూరుతాయి. కార్పొరేట్ ఆసుపత్రులతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సనత్‌నగర్‌లో నిర్మించిన డా.మర్రి చెన్నారెడ్డి టిమ్స్ ఆసుపత్రిని ఆయన సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులతో కలిసి ప్రారంభించారు. తొలుత అన్ని బ్లాకులను కలియదిరిగిన సీఎం.. వైద్యులను అడిగి అక్కడి సేవలను తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన సభలో మాట్లాడారు. "మేం

- మిగతా 2వ పేజీలో



# సీఎం ఇల్లు కూడా నిషేధిత జాబితాలోనా?

## మీడియాతో ఇష్టాగోష్ఠిలో హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాతీర్పు)

నిషేధిత భూముల జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా ఉందంటే ఆశ్చర్యం కలుగుతోందని.. తమ సొంత ఇంటికి సెగ తగిలేసరికి ప్రభుత్వంలో హడావిడి

- మిగతా 2వ పేజీలో



# తప్పు ఎన్‌టీఏది.. శిక్ష విద్యార్థులకా?

## జీసీ పునఃపరీక్షలపై రాహుల్ ఫైర్

- విద్యార్థుల సమయం, డబ్బు వృథా
- మానసిక ఒత్తిడికి బాధ్యులెవరు?
- మోదీ సమాధానం చెప్పే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం
- విద్యార్థుల తరపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 17 (ప్రజాతీర్పు)

జీసీ- ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టులకు మరోసారి పరీక్ష నిర్వహించాలన్న జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. పరీక్షలకు నెలల తరబడి సిద్ధమై, ఇప్పటికే పరీక్షలు రాసిన వేలాది మంది అభ్యర్థులు..

- మిగతా 2వ పేజీలో

# మరో సంచలనం

## దిమాగీ నక్సల్ జనతా పార్టీ!

## ఒక్కరోజులో 2లక్షల ఫాలోవార్లు

### సోషల్ మీడియాలో హల్చల్

### సీజేపీ తరహాలోనే.. మోదీ వాక్యాల నుంచి..

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంలో ప్రధాని మోదీ చేసిన 'దిమాగీ నక్సల్స్' వ్యాఖ్యల తర్వాత 'దిమాగీ నక్సల్ జనాతా పార్టీ' పేరుతో సోషల్ మీడియాలో పుట్టుకొచ్చిన పార్టీకి ఒక్క రోజు వేలాది మంది ఫాలోవర్ల రావడం హాట్ టాపిక్ గా మారింది. 24 గంటల్లోనే 2 లక్షల ఫాలోవర్స్ సంపాదించింది. దిమాగీ నక్సల్ జనతా పార్టీ అనే ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ హ్యాండిల్స్ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. మేం




- మిగతా 2వ పేజీలో



# గ్రేటర్ జిల్లాల్లో 43 లక్షల ఓటర్ల తొలగింపు!

## తెలంగాణలో 'సర్' ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

- 3.68కోట్ల నుంచి 2.64కోట్లకు తగ్గిన ఓటర్లు
- ఫారాలివ్వని 73,39,235 మంది తొలగింపు
- 43 లక్షల మంది హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల వారే
- 92,87,577 మందికి నోటీసులు!
- వీరిలో 32,36,659 మంది అన్‌మ్యాప్డ్.. 60,50,918 మంది వ్యత్యాసాలున్న ఓటర్లు



రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ(సర్), 2026లో భాగంగా సోమవారం రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించారు. 'సర్2026'ప్రక్రియ చేపట్టడానికి ముందు రాష్ట్రంలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లుండగా, తాజాగా ప్రకటించిన ముసాయిదా జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,64,87,213కు తగ్గిపోయింది.

# గ్రేటర్ జిల్లాల్లో 43 లక్షల ఓటర్ల తొలగింపు!

- విచారించనున్న 119 ఈఆర్వోలు, 892 మంది ఏఈఆర్వోలు
- విలేకరుల సమావేశంలో సీఈఓ సి.సుదర్శన్‌రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 17 (ప్రజాతీర్పు)**

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈఓ) సి.సుదర్శన్ రెడ్డి సోమవారం తమ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారు. ఆచూకీ లేరు/శాశ్వతంగా నివాసం మారారు/చనిపోయారు/మరో చోట ఓటుకలిగి ఉన్నారు(ఏఎస్‌డీడీ)..అనే కారణాలతో ఏకంగా 73,39235 మంది(21.7 శాతం) ఓటర్లను ముసాయిదా ఓటర్ల జాబితాలో తొలగించారు. శాతాల వారీగా పరిశీలిస్తే రాష్ట్రంలో సగటున 21.7 శాతం ఓటర్లను తొలగించగా..హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 40.99శాతం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 35.97శాతం, రంగారెడ్డి జిల్లాలో 34.79శాతం, ఓటర్లను తొలగించారు. సంఖ్యాపరంగా పరిశీలిస్తే హైదరాబాద్ జిల్లాలో 19,41,444 మంది, రంగారెడ్డి జిల్లాలో 12,87,091 మంది, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో 10,71,566 మంది కలిపి ఈ మూడు జిల్లాలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఏకంగా 43,00,101 మంది ఓటర్లను తొలగించారు. రాష్ట్రంలో తొలగించిన 73,39235 మంది ఓటర్లలో 58.59 శాతం ఓటర్లు ఈ 3 జిల్లాలకు చెందినవారే కావడం గమనార్హం. ఇక అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే ..అత్యధికంగా ముషీరాబాద్‌లో 45.17%, సనత్‌నగర్‌లో 44.93%, మలక్‌పేటలో 44.76%, ఎల్బీనగర్‌లో 44.44%, జూబ్లీహిల్స్‌లో 44.14% శాతం ఓటర్లను తొలగించారు. సంఖ్యాపరంగా చూస్తే శేరిలింగంపల్లి 3,29,828, కుత్బుల్లాపూర్‌లో 2,76,924, ఎల్బీనగర్‌లో 2,70,284, రాజేంద్రనగర్‌లో 2,47,005, మహేశ్వరంలో 2,35,331, ఉప్పల్‌లో 2,18,323, మేడ్చల్‌లో 2,13,122 మంది ఓటర్లను తొలగించారు. ముసాయిదా జాబితాలోని 2,64,87,213 మంది ఓటర్లలో ఏకంగా 92,87,577 మంది(35.06%) ఓటర్ల పేర్లు అక్టోబర్ 19న ప్రకటించే తుది ఓటర్ల జాబితాలో వస్తుందో రాదో అనుమానమే. 'సర్'ప్రక్రియలో భాగంగా సమర్పించిన ఎన్యూమరేషన్ ఫారంలో సర్2002 ఓటర్ల జాబితాలో తమ పేరు/తమ తల్లిదండ్రులు/వారి తల్లిదండ్రుల పేరు ఉన్నట్లు నమోదు చేయాల్సి ఉండగా, 32,36,659 మంది(12.22శాతం) ఓటర్లు ఈ వివరాలను అందించలేదు. దీంతో వారిని 2002 సర్ జాబితాలో అనుసంధానం కాని(అన్‌మ్యాప్డ్) ఓటర్లుగా గుర్తించారు. ఇక ఫారంలో ఈ వివరాలిచ్చిన వారిలో 60,50,918 మంది(22.84%) మంది ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలున్నట్లు నిర్ధారించారు. అంటే, ప్రస్తుత ఓటర్ల జాబితాలో పోల్చితే 2002 ఓటర్ల జాబితాలోని వీరి వివరాల్లో 11 రకాల వ్యత్యాసాలున్నాయని సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ రెండు కేటగిరీలు కలిపి మొత్తం 92,87,577 మంది(35.06%) ఓటర్లకు స్థానిక ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు(ఈఆర్వోలు), ఏఈఆర్‌లు నోటిసులు జారీ సంజాయిషీ కోరనున్నారు. స్థానిక బీఎల్‌ఓలే సంబంధిత ఓటర్లకు నోటిసులు తీసుకొచ్చి ఇస్తారని, రాతపూర్వక సంజాయిషిని వారికి లేదా స్థానిక ఈఆర్వోకు సమర్పించాలని ఓటర్లకు సూచించారు. ప్రత్యక్ష విచారణ అవసరమైన ఓటర్లను మాత్రం నిర్దేశిత తేదీకి పిలిపించి విచారిస్తారని సీఈఓ వెల్లడించారు.

నోటీసులు అందుకున్న ఓటర్లు ఎన్నికల సంఘం నిర్దేశించిన 11 రకాల ధ్రువీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని రుజువుగా సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ 11 రకాల పత్రాలే అంతిమం కాదని, చట్టబద్ధంగా జారీ చేసిన ఇతర ధ్రువీకరణ పత్రాలను స్వీకరించే విషయంలో విచక్షణాధికారాన్ని ఈఆర్వోలకు చట్టబద్ధంగా కల్పించినట్టు ఆయన తెలిపారు. అక్టోబర్ 15లోగా విచారణ ప్రక్రియ పూర్తి చేస్తారన్నారు. ఒక వేళ సమయం సరిపోకుంటే గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతామన్నారు. రాష్ట్రంలో 119 మంది ఈఆర్వోలు, 890 మంది ఏఈఆర్‌ఓలుండగా, విచారణ వేగిరం కోసం 5001000 మంది అదనపు ఏఈఆర్‌ఓలను సైతం నియమించాలని ఈసీని కోరుతామన్నారు.

నోటీసులు అందుకోనున్న ఓటర్లు తప్పనిసరిగా నిర్దేశిత గడువులోగా వివరణ ఇవ్వాలని సీఈఓ సుదర్శన్ రెడ్డి కోరారు. లేకుంటే వారి పేర్లను తుది ఓటర్ల జాబితాలో తొలగిస్తారన్నారు. 2013 జూన్ 25న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో ఆధారంగా గత జూలై 25కి ముందు జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను సైతం నోటీసులు అందుకున్న ఓటర్లు రుజువుగా సమర్పించవచ్చన్నారు. గత జూలై 25న విడుదల చేసిన జీవో ఆధారంగా జారీ చేసిన ఫ్యామిలీ రిజిస్ట్రర్ సర్టిఫికేట్లను స్వీకరించవద్దని ఈసీ కోరిందన్నారు.

సర్, 2026 ప్రక్రియ ప్రారంభమైన వెంటనే రాష్ట్రంలో కొత్త ఓటర్ల నమోదుకి ఫారం6 దరఖాస్తుల స్వీకరణను నిలుపుదల చేసిన ఎన్నికల సంఘం..సోమవారం నుంచి మళ్లీ పునరుద్ధరించింది. కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6దరఖాస్తుతో పాటు స్వీయ ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. దీనితో పాటు ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను సెప్టెంబర్ 16వరకు స్వీకరించనున్నారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు రాని ఓటర్లు తుది ఓటర్ల జాబితాలో చోటు సాధించడం కోసం ఫారం6 దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని సీఈఓ సుదర్శన్ రెడ్డి సూచించారు. సర్ ప్రక్రియలో భాగంగా ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు తొలగించిన ఓటర్ల(ఏఎస్‌డీడీ) జాబితాను సోమవారం ప్రకటించాల్సి ఉండగా, ముసాయిదా జాబితాను మాత్రమే ఆన్‌లైన్‌లో అందుబాటులోకి ఇచ్చారు. తొలగించిన ఓటర్ల జాబితాను, అనామలీస్/అన్‌మ్యాప్డ్ ఓటర్ల జాబితాలను ఆన్‌లైన్‌లో సీఈఓ కార్యాలయం ఆదివారం రాత్రివరకు విడుదల చేయలేదు. అత్యంత పారదర్శకంగా సర్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు ఈసీ పేర్కొన్న నేపథ్యంలో ఈ జాబితాలను సైతం ఆన్‌లైన్‌లో విడుదల చేయాలని విలేకరుల కోరగా, విడుదల చేస్తామని సీఈఓ సుదర్శన్ రెడ్డి బదులిచ్చారు. పొరుగు రాష్ట్రం ఏపీలో సీఈఓ కార్యాలయం వెబ్‌సైట్‌లో తొలగించిన ఓటర్ల వివరాలను అందుబాటులో ఉంచారు. అందులో ఏ ఓటరును ఏ కారణంతో తొలగించారో అనే సమాచారం సైతం పొందుపరిచారు. తొలగించిన ఓటర్లు 73లక్షలు, అన్‌మ్యాప్డ్, వివరాల్లో తేడాలున్న ఓటర్లు 92 లక్షలు కలిపితే 1.66 కోట్ల మంది ఓటర్లు కానున్నారు. మొత్తం 3.38 కోట్లలో వీరి శాతం 49.15 కానుంది. రాష్ట్రంలో దాదాపుగా 50శాతం మంది ఓటర్లు తొలగింపు ముప్పును ఎదుర్కొంటున్నారు.

# మరో సంచలనం దిమాగీ నక్సల్ జనతా పార్టీ!

(మొదటి పేజీ తరువాయి)

భగత్ సింగ్ అనుచరులం.. ఒక వేళ వాళ్లు మా అకౌంట్లను బ్లాక్ చేసినా.. నిలిపివేయటానికి ప్రయత్నించినా లేదా మమ్మల్ని దేశ ద్రోహులుగా ముద్ర వేసినా.. అలాంటి వాళ్లు భగత్ సింగ్ ను అవమానించినట్లే అంటూ నోట్ రిలీజ్ చేసింది దిమాగీ నక్సల్స్ జనతా పార్టీ. 'థింక్.. రీసెర్చ్.. రెసిస్ట్' నినాదంతో ఇన్‌స్టాగ్రామ్‌లో 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరిట ప్రారంభమైన ఖాతాకు కేవలం 24 గంటల్లోనే 2లక్షల మందికిపైగా ఫాలోవర్లు చేరారు. ఇక ఎక్స్ (ట్విట్టర్) వేదికగా 'దిమాగీ నక్సల్ జనతా పార్టీ' పేరుతో ఉన్న ఖాతాకు 50,000 మందికి పైగా ఫాలోవర్లు వచ్చారు. ఈ పార్టీ వ్యవస్థాపకుడు "ఒక మేధావి భారతీయుడు" అని, సహ వ్యవస్థాపకుడు "56 అంగుళాల వ్యక్తి" అని చమత్కారంగా పేర్కొన్నారు. గతంలో వచ్చిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ట్రెండ్‌లాగే, 'దిమాగీ నక్సల్ పార్టీ' పేరుతో మీమ్స్, వ్యంగ్య పోస్టులు వైరల్ అవుతూ వేలాది మంది ఫాలోవర్లను సంపాదిస్తున్నాయి 'కాక్రోచ్ జనతా పార్టీ' తరహాలో గంట గంటకు ఫాలోవర్లు పెరిగిపోతున్నారు. ప్రశ్నించే వాళ్లు దిమాగీ నక్సల్స్ అవుతారా అంటూ దుమ్మెత్తిపోస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ 'దిమాగీ నక్సల్స్' పేజీకి పోస్టులు పెడుతున్నారు. 'దిమాగీ నక్సల్ పార్టీ' వెనుక ఎవరున్నారనే దానిపై స్పష్టత లేదు.

స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో ప్రధాని మోదీ మాట్లాడుతూ దేశంలో సాయుధ నక్సలిజం అంతమైందని.. ఆ స్థానంలో దిమాగీ నక్సల్స్ పొంచి ఉన్నారంటూ మోదీ కామెంట్స్ చేశారు. ఆయుధాలు పట్టిన నక్సలైట్లను ప్రభుత్వం మట్టుబెట్టినా, ఆ సిద్ధాంతాన్ని సమర్థించే కొందరు 'దిమాగీ నక్సల్స్' ఇంకా వ్యవస్థలో ఉంటూ యువతను భ్రమల్లోకి నెడుతున్నారని ప్రధాని హెచ్చరించారు. అటువంటి వారిని గుర్తించి సమాజం నుంచి వేరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. "వామపక్ష తీవ్రవాదం (లేదా నక్సల్) లక్షలాది మంది యువత భవిష్యత్తును నాశనం చేసింది. అనేక దశాబ్దాలుగా నక్సల్ హింస దేశంలోని పెద్ద భాగాన్ని తుపాకీ గుప్పిట్లో ఉంచుకుంది" అని ప్రధాని ఆగస్టు 15 నాటి ప్రసంగంలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్ ఈ వ్యాఖ్యలను ప్రధాని నైరాశ్యానికి నిదర్శనంగా అభివర్ణించారు.

'దిమాగీ నక్సల్' అని పిలిచినా గర్వపడతానంటూ సీనియర్ కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం వ్యాఖ్యానించారు. కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధి సౌరవ్ దాస్ కూడా ప్రధాని వ్యాఖ్యలపై స్పందించారు. "ప్రభుత్వాన్ని ప్రశ్నించినంత మాత్రాన చదువుకున్న యువతపై 'నక్సలైట్లు' అని ముద్ర వేయడం తీవ్ర అహంకారానికి, సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం" అని సౌరవ్ దాస్ ఆరోపించారు. మావోయిస్టులు, వేర్పాటువాదులకు మద్దతిచ్చేవారినే ఉద్దేశించి మాత్రమే ప్రధాని మోదీ ఆ వ్యాఖ్యలు చేశారని, ప్రతిపక్షాలను ఉద్దేశించి కాదని ఇప్పటికే మోదీ ఇలా అన్నారని ఇప్పటికే కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వివరణ ఇచ్చారు.

# తప్పు ఎన్‌టీఏది.. శిక్ష విద్యార్థులకా?

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌టీఏ వైఫల్యాల కారణంగా మళ్లీ పరీక్ష రాయాల్సిన పరిస్థితి రావడం అన్యాయమని ఆయన పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు, ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'మోదీజీ.. మీ ఎన్‌టీఏ ఏం చేసిందో చూడండి. జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ జీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### దోపిడీ యంత్రంగా పరీక్షల వ్యవస్థ!

పరీక్షల వ్యవస్థను విద్యార్థులను దోపిడీ చేసే యంత్రంగా మార్చారని రాహుల్ ఆరోపించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు దేశంలో సరైన వ్యవస్థ లేదని వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యావ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని విమర్శించారు. జీసీ-నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడంలేదని ప్రశ్నించారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనని, ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వం పరీక్షలు నిర్వహించలేని వ్యవస్థను నిర్మించిందని విమర్శించారు. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు విద్యార్థులనే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై ప్రధాని మోదీ సమాధానం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# 6 నెలలకో ఆస్పత్రి

(మొదటి పేజీ తరువాయి)

టిమ్స్‌ను ప్రారంభిస్తామని చెప్పగానే సనత్‌నగర్ ఎమ్మెల్యేతో కలిసి కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. మీరే కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ ఫాంహౌస్‌ల నిర్మాణం ఆలస్యం కానివ్వలేదుగానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తిచేయాలనే ఆలోచన రాలేదా? ఇంకా ఎన్ని రోజులు అబద్ధాలు ప్రచారం చేస్తారు.. మీరు అబద్ధాలు చెప్పడం ఆపనంత కాలం నేను నిజాలు చెబుతూనే ఉంటా. కేసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలానే ఉండాలని కోరుకుంటున్నా. అప్పుడు మా పని సులువవుతుంది. వానలు కురవకూడదని, ప్రజలు నాశనం కావాలని కోరుతూ క్షుద్ర పూజలు చేస్తున్నారు. మీరు సంపాదించిన రూ.లక్ష కోట్లల్లో నియోజకవర్గానికో రూ.10-20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయి.

ప్రజా ప్రభుత్వం వైద్యం, విద్య కోసం నిధులు వెచ్చించడాన్ని ఖర్చులా చూడటం లేదు. పెట్టుబడిగా భావిస్తోంది. పేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరితే బిల్లులు చెల్లించేందుకు ఆస్తులు అమ్ముకున్నా చాలడం లేదు. రాష్ట్రంలో 4 కోట్ల మందికి వైద్యసేవలు అందించే లక్ష్యంతో ఆధునిక వైద్య సేవలు ప్రారంభిస్తున్నాం. 32 నెలల పరిపాలనలో ఆరోగ్యశ్రీలో రూ.2,700 కోట్లు ఖర్చు పెట్టాం. సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.2,500 కోట్లు వెచ్చించాం. దేశంలో పేదల కోసం ఏ ప్రభుత్వం ఈ స్థాయిలో నిధులు కేటాయించలేదు. వైద్యశాఖపరంగా ఏటా రూ.13 వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయిస్తే.. ప్రజా ప్రభుత్వం వచ్చాక రూ.21,800 కోట్లు వెచ్చించాం. ఇది బాధ్యతగా భావిస్తున్నాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరి వానాకాలంలో వరద వచ్చి రోగులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లకు ఆ ఆసుపత్రిని ఇంకోచోట నిర్మించాలన్న ఆలోచన రాలేదు. రూ.2,700 కోట్లతో మా ప్రభుత్వం ఆసుపత్రిని వేరేచోట నిర్మిస్తోంది. మూడు టిమ్స్ ఆసుపత్రులకు టెంకాయ కొట్టారు. నిధులు, నిర్మాణం మాత్రం మరచిపోయారు. వరంగల్ ఆసుపత్రిది కూడా అదే పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టిసారించాం.

అదనపు గంటలు పనిచేసే సూపర్ స్పెషాలిటీ వైద్యులు, సిబ్బందికి ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్ నుంచి ప్రోత్సాహకాలు అందించే ఆలోచన చేయాలి(మంత్రి దామోదర రాజనర్సింహకు సూచిస్తూ). విద్యార్థులకు నర్సరీ నుంచి 12వ తరగతి వరకు మెరుగైన విద్య అందించి.. స్కిల్స్ నేర్పితే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటారు. ఎవరూ ఇష్టంతో ఉచితంగా సంక్షేమ పథకాలు తీసుకోరు. ఎలాంటి పని కల్పించనప్పుడే సంక్షేమ పథకాలు వైపు చూస్తారు. నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయి. విదేశీ భాషలు నేర్చుకుంటే రూ.లక్షల జీతాలు వస్తాయి' అని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్, శ్రీగణేశ్, ఎమ్మెల్సీలు ప్రొ.కోదండరాం, బల్మూరి వెంకట్, వైద్యారోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, డీఎంఈ డా.వాణి, టిమ్స్ డైరెక్టర్ డా.నరేందర్‌కుమార్, నిమ్స్ డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవ్‌రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిమ్స్‌లో వేయి రోబోటిక్ సర్జరీలు పూర్తి చేసిన వైద్య బృందం, గుత్తేదారు సంస్థ మేఘా ఇంజినీరింగ్ అధినేత కృష్ణారెడ్డి బృందాన్ని సీఎం జ్ఞాపికలతో సత్కరించారు. అంతకుముందు సీఎం చేతులు మీదుగా టీజీసేఫ్, ఆరోగ్య దీపిక పాలీ క్లినిక్‌లను ఆన్‌లైన్‌లో ప్రారంభించారు.





# జేఎస్ఎస్సీ పరీక్షలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

సోరెన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. hfgj నుంచి ఔట్ సోర్సింగ్ సంస్థ టీడీపీఎల్ నిర్వహించిన అన్ని పరీక్షలు, వాటి ఫలితాలనూ రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే, జేఎస్ఎస్సీ పరిధిలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణకు సీఎం ఆదేశించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. పరీక్షల అక్రమాలను ప్రశ్నిస్తూ, వాటిపై సీబీఐ విచారణ కోరుతూ 24 రోజులుగా రాంచీలో విద్యార్థులు ఆందోళన చేపడుతున్న నేపథ్యంలో, సీఎం వారిని ఉద్దేశించి కూడా మాట్లాడారు. పేపర్ లీకేజీలు, మోసాలను అరికట్టేందుకు త్వరలోనే కఠిన చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ నియామకాల వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి, పారదర్శకతను తీసుకువస్తామని తెలిపారు. విద్యార్థులతో వెళ్లి స్వయంగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకోవాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లేఖ రాసిన కొద్ది గంటల్లోనే సీఎం హేమంత్ సోరెన్ స్పందించడం గమనార్హం. మరోవైపు, పరీక్షల అక్రమాలపై సీఐడీ ముమ్మర విచారణ జరుపుతున్నది. విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ విడిగా విచారణ చేపడుతున్నది. పరీక్షల్లో అక్రమాలు జరిగినట్లు ఇప్పటికే ఆయా బృందాలు ఆధారాలు సేకరించాయి.

# రేవంత్ దూకుడు!

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ అసెంబ్లీకి రావాలని కూడా డిమాండ్ చేస్తున్నారు.

**రాజకీయ సభల్లా.. :** సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల సంగారెడ్డి, వరంగల్‌లో నిర్వహించిన సభలు వాస్తవానికి అధికారిక కార్యక్రమాలు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే, వరంగల్ జిల్లా పరకాల, హన్మకొండల్లో దాదాపు రూ. 484 కోట్ల విలువైన పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ రెండు అధికారిక కార్యక్రమాలే. కానీ, ఈ రెండు సభలు కూడా రాజకీయ ప్రచార సభలుగా.. విపక్షాలను ముఖ్యంగా బీఆర్ఎస్‌పై విమర్శలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి వినియోగించుకున్నారు.

### ఇరకాటంలో బీఆర్ఎస్..

సీఎం రేవంత్‌రెడ్డి దూకుడుతో బీఆర్ఎస్ ఇరకాటంలో పడుతోంది. రేవంత్ విసిరే మాస్ పొలిటికల్ అటాక్స్‌కు రాజకీయంగా ప్రత్యక్ష సమాధానం చెప్పలేక, డిజిటల్ కౌంటర్లు ఇవ్వడానికే బీఆర్ఎస్ పరిమితమవుతోంది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై లీగల్ నోటీసులు పంపడం, కేసులు పెడతామని హెచ్చరించడం వంటి న్యాయపరమైన రక్షణ మార్గాలను బీఆర్ఎస్ వెతుక్కుంటున్నప్పటికీ, ఫీల్డ్‌లో రేవంత్ సృష్టిస్తున్న రాజకీయ ప్రభావాన్ని తిప్పికొట్టడంలో ఆ పార్టీ కొంత వెనుకబడిందనే అభిప్రాయాలు ఉన్నాయి. కేటీఆర్ లీగల్ నోటీసుల హడావుడిని సైతం రేవంత్ రెడ్డి పబ్లిక్ మీటింగ్స్‌లో పొలిటికల్ మైలేజ్ కింద మార్చుకుంటున్నారు. అయితే, సోషల్‌మీడియాలో మాత్రం కాంగ్రెస్ కొంత వెనుకబడే ఉందని చెప్పవచ్చు. డిజిటల్ మీడియాలో వచ్చే విమర్శలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ సరైన ప్రభావం చూపలేకపోతోంది. అయితే, ఆ లోపాన్ని రేవంత్ రెడ్డి తన సుడిగాలి పర్యటనలు, మాస్ ప్రసంగాలతో భర్తీ చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఆన్‌లైన్ రాజకీయంలో బీఆర్ఎస్ చక్రం తిప్పుతుంటే, ఆఫ్ లైన్ గ్రౌండ్ రాజకీయంలో కాంగ్రెస్ తన పట్టును నిలుపుకోవడానికి ప్రయత్నిస్తోంది.

# రాజకీయ కక్షతోనే టిమ్స్ ప్రారంభంలో జాప్యం

(మొదటి పేజీ తరువాయి)

కూడా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించాలన్న సమున్నత ఆశయంతో కేసీఆర్ నిర్మించిన సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి ఎట్టకేలకు ప్రజలకు అందుబాటులోకి రావడం హర్షనీయమని సోమవారం ఎక్స్ వేదికగా స్పందించారు. ఒక్క సనత్ నగర్ టిమ్స్‌లోనే 1,000 పడకలు, 300 ఐసీయూ బెడ్లు, 16 ఆపరేషన్ థియేటర్లు, అవయవ మార్పిడి విభాగం, ఎంఆర్ఐ, సిటీస్కాన్, ఎక్స్ రే, క్యాథలాబ్స్, రేడియాలజీ, డయాలసిస్ సెంటర్ వంటి అన్నిరకాల విభాగాలు ఒకేచోట ఉండటం రోగులకు వెలకట్టలేని వరమని పేర్కొన్నారు. కేవలం హైదరాబాద్ వాసులకే కాకుండా జిల్లాల నుంచి ప్రాణాపాయ స్థితిలో రాజధానికి వచ్చే రోగులకు కూడా ఈ సనత్ నగర్ టిమ్స్ ఆసుపత్రి ఒక సంజీవనిగా సేవలందించనుందని, 22 ఎకరాల సువిశాల ప్రాంగణంలో చేపట్టిన ఈ ఆసుపత్రి నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీర్లకు, ఆసుపత్రిలో సేవలందించే వైద్యులు, నర్సింగ్ స్టాఫ్, ఇతర సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో ప్రాథమిక వైద్యం కోసం రూపకల్పన చేసిన 350 బస్తీ దవాఖానాలతోపాటు, కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించేందుకు 4000 పడకలు, ఆక్సిజన్ వసతి కలిగిన 1200 ఎమర్జెన్సీ బెడ్లు.. పేద రోగులకు కొండంత భరోసా ఇవ్వనున్నాయని వెల్లడించారు. ఇప్పటికైనా రెండు వేల పడకలతో తెలంగాణలోనే అతిపెద్దదైన వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని, హైదరాబాద్ లోని నిమ్స్ విస్తరణ పనులను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సీఎం ఇల్లు కూడా నిషేధిత జాబితాలోనా?

(మొదటి పేజీ తరువాయి)

మొదలైం దని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు మండిపడ్డారు. "స్వయంగా ముఖ్యమంత్రి పరిస్థితే ఇలా ఉంటే.. ఇక రాష్ట్రంలో సామాన్య ప్రజల పరిస్థితి ఏంటి... వాళ్ల గోడు ఎవరు వినాలి?" అని ఆయన ప్రశ్నించారు. ప్రజలను అడ్డగోలుగా దోచుకునే ఆయుధంగా ఈ ప్రభుత్వానికి '22ఏ' జాబితా మారిందని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం హరీశ్‌రావు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ... "ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి ప్రభుత్వ భూములను.. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లో హౌసింగ్ సొసైటీ భూములను కూడా 22ఏ నిషేధిత జాబితాలో పెట్టారంటే.. ఈ అధికారుల పనితీరు ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. నిషేధిత జాబితాలో ఉన్న విషయం తెలియక రిజిస్ట్రేషన్ కోసం డబ్బు కడితే.. చెల్లించిన డబ్బులను వెనక్కి ఇవ్వడంలేదు. కమీషన్ల కోసమే నిషేధిత జాబితాలో చేర్చడం.. ముడుపులు ముట్టాక తొలగించడం వంటివి చేస్తున్నారు. దీనిపై తక్షణమే విచారణ జరపాలి. భారాస పోరాటం వల్లే గోదావరి, కృష్ణా నదీ జలాల మేనేజ్‌మెంట్ బోర్డుల సమావేశాలు వాయిదా పడ్డాయి. అయితే, ఎజెండా నుంచి తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టుల అంశాన్ని తొలగించే వరకూ పోరాడతాం. ఈ ప్రభుత్వం చేస్తున్న స్కామ్‌లను ఒక్కొక్కటిగా బయటపెడుతున్నాననే కక్షతో... సీఎం రేవంత్‌రెడ్డి నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు. నేను ఆధ్యాత్మిక భావనతో తమిళనాడులోని తిరుచ్చిలో ఉన్న శ్రీరంగనాథస్వామి దేవాలయానికి, కర్ణాటకలోని కొల్లూరు మూకాంబికా అమ్మవారి ఆలయానికి వెళ్లాను. కానీ, నేను అక్కడేవో పూజలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. నేను నిజంగా అలాంటి పూజలు చేసినట్లు ముఖ్యమంత్రి దగ్గర ఆధారాలుంటే.. తక్షణమే బయటపెట్టాలని సవాల్ విసురుతున్నా. తెలంగాణ ఉద్యమం గురించి మాట్లాడే నైతిక అర్హతే ఈ ముఖ్యమంత్రికి లేదు. ఉద్యమంలో నా మీద 370 కేసులున్నాయి. నా పోరాటాన్ని, త్యాగాలను చూసి ప్రజలు.. పోటీ చేసిన ప్రత్యర్థులకు ఏడుసార్లు డిపాజిట్లు రాకుండా నన్ను గెలిపించారు" అని పేర్కొన్నారు.



# బీజేపీకి వ్యతిరేకంగా దళితులు సంఘటితం కావాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**

దళితుల పట్ల బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తూ దళితులంతా సంఘటితం కావాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఖర్గేకు జరిగిన అవమానానికి నిరసనగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్లో నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మల్లికార్జున ఖర్గే కు జరిగిన అవమానాన్ని తేలికగా తీసుకోవద్దని, దళితుల ఆత్మాభిమానం, అస్థిత్వంపై జరిగిన దాడిగా భావించాలన్నారు. దళితులను అవమానించడం కమలనాధులకు కొత్తేమీ కాదని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను మొదలుకొని మల్లికార్జున ఖర్గే వరకూ కొనసాగిందన్నారు. ప్రజల మధ్య మతం, కులం పేరుతో చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందే శక్తులను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, మైనార్టీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, ఎస్టీ సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్, మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, స్వామి గౌడ్, వెన్న రాజ మల్లయ్య సిరాజ్ హుస్సేన్, అబ్దుల్ రెహమాన్, ముస్తాక్ అహ్మద్, మాతంగి అనిల్, రెడ్డవేని రాజు, బోయిన విద్యాసాగర్, అల్వాల కోటి, జీడి రమేష్, ఆసంపల్లి శ్రీనివాస్, యనమల మంజుల, ములకల కవిత, మమత, తిరుమల, సముద్రాల అజయ్, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బత్తుల పరుశురాములు, సముద్రాల లక్ష్మణ్, ఆరేపల్లి రాహుల్, వాసాల శ్రీనివాస్, కీర్తి కుమార్, తిరుపతి, బోయిని కృష్ణ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పీ.యం.జే. జ్యువెలర్స్ దొంగల ముఠాపై పీడీ యాక్ట్ అమలు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**

కరీంనగర్ పట్టణంలోని పీయంజే జ్యువెలర్స్లో జరిగిన సంచలన దొంగతనం కేసులో ప్రధాన నిందితులైన ఐదుగురు ముఠా సభ్యులపై కరీంనగర్ పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. మే 3న పీయంజే జ్యువెలర్స్ షాపులోకి చొరబడిన నిందితులు సిబ్బందిపై తుపాకులతో కాల్పులు జరిపి, సుమారు 82 లక్షల విలువైన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో ప్రధాన నిందితులైన రఘునాథ్ కర్మాకర్ ఏ జాగీరా సింగ్(41), రావిష్ కుమార్ ఏ ప్రద్యుమాన్(23), సూర్యమణి కుమార్ ఏ సనోజ్(21), యాదవ్ ఏ జైనుల్ అబ్దిన్(33), మొహమ్మద్ ఆదిల్ ఖాన్(31) పీడీ యాక్ట్ అమలు చేశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను కరీంనగర్ జిల్లా జైలులో నిందితులకు అందజేసి, అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. పీడీ యాక్ట్ అమలులో కీలక పాత్ర పోషించిన కరీంనగర్ పట్టణ ఏసీపీ ఎన్ వెంకటస్వామి, కరీంనగర్ రెండవ పట్టణ సీఐ కె సృజన్ రెడ్డి, పీడీ సెల్ పండరి, హెడ్ కానిస్టేబుల్ శంకర్ లను పోలీస్ కమిషనర్ అభినందించారు. నేరాలకు పాల్పడే వారిపై కరీంనగర్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, ప్రజల భద్రతకు విఘాతం కలిగించే నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.

# కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు తూట్లు పొడిచే కుట్ర!

## మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**

ఎన్నికల సమయంలో ఆడబిడ్డల వివాహానికి 'తులం బంగారం' ఇస్తామని ఆర్భాటంగా హామీనిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ మాట నిలబెట్టుకోలేక కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు తూట్లు పొడిచే కుట్రలకు తెరలేపిందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ నరదాసు లక్ష్మణ్ రావు ధ్వజమెత్తారు. సోమవారం నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్లో గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ రావు మాట్లాడుతూ తులం బంగారం ఇవ్వడం చేతకాక, మరోవైపు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేసేందుకు ప్రభుత్వమే తెరవెనుక నుండి హైకోర్టులో కేసు వేయించి స్టే తెచ్చిందని ఆయన ఆరోపించారు. తులం బంగారం ఇవ్వడం చేతకాక, మరోవైపు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలును నిలిపివేసేందుకు ప్రభుత్వమే తెరవెనుక నుండి హైకోర్టులో కేసు వేయించి స్టే తెచ్చిందని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్, కార్పొరేటర్లు నలువాల రవీందర్, యూసుఫ్, మాజీ కార్పొరేటర్లుఎడ్ల సరిత అశోక్, గందె మాధవి మహేష్, దిండిగాల మహేష్, ఎదుల్లా రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద దారుణం.

- మద్యం మత్తులో భార్యాభర్తల హంగామా...

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 17**

మద్యం మత్తులో భార్యపై కత్తితో దాడి చేసిన భర్త కత్తి దాడిలో భార్యకు తీవ్ర గాయాలు.. భారీగా రక్తస్రావం భార్యను ఆస్పత్రికి తరలించే క్రమంలో అడ్డుకున్న భర్త సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించిన పోలీసులు ఆస్పత్రిలోనూ హంగామా చేసిన తాగుబోతు భర్త పోలీసులను, ఆస్పత్రి సిబ్బందిని దౌర్జన్యంగా అడ్డుకున్న భర్త తంగళ్ళపల్లి మండల కేంద్రానికి చెందిన దంపతులు, ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు

# కేసుల ఛేదనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ...
- ప్రజలు తమ వ్యక్తిగత భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి
- మల్యాల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 48 నూతన సీసీ కెమెరాలను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగష్టు 17**



ఆధునిక యుగంలో నేరాల నియంత్రణ, కేసుల ఛేదన, ప్రజా భద్రత పరిరక్షణలో సీసీ కెమెరాల వినియోగం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ప్రతి పట్టణం, ప్రతి గ్రామం సీసీ కెమెరాలతో నిండినప్పుడు పోలీసింగ్ మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్లో భాగంగా మల్యాల గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన 48 నూతన సీసీ కెమెరాలను ఈరోజు ఎస్పీ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా గా ఎస్పీ మాట్లాడుతూ....ప్రజల రక్షణకు, నేరాల అరికట్టడానికి సీసీ కెమెరాలు అమూల్యమైన సాధనాలు అని. ప్రతి వీధి, ప్రతి మూలలా కెమెరాలు అమర్చడం వలన నేరం జరిగిన వెంటనే గుర్తించడం, నిందితులను పట్టుకోవడం చాలా వేగంగా జరుగుతోంది అన్నారు. ఈ మధ్య కాలంలో మల్యాల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసు లో సీసీ కెమెరాలు నిందితుని గుర్తించి అరెస్ట్ చేయడం జరిగిందని అన్నారు. ఇప్పటికే జగిత్యాల ,మెట్ పల్లి, ధర్మపురి, కోరుట్ల, ఈరోజు మల్యాల లో పెద్ద మొత్తంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వలన దొంగతనాలు, చోరీలు, గొడవలు, రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనల్లో నిందితుల కదలికలు రికార్డ్ అయి పోలీసులు వెంటనే గుర్తించి అరెస్టులు, కోర్టు లో నిందితులకు శిక్షలు పడటం జరిగిన అనేక ఉదాహరణలు ఉన్నాయని అన్నారు. ప్రజలు తమ ఇళ్లకు, వ్యాపార సంస్థలకు, అపార్ట్మెంట్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే వ్యక్తిగత భద్రతతో పాటు సమాజ భద్రత కూడా బలోపేతం అవుతుందని సూచించారు. ప్రత్యేకంగా ప్రధాన రహదారులు, క్రాస్ రోడ్లు, బిజీ సెంటర్లు, మార్కెట్ ఏరియాల్లో కెమెరాల ఏర్పాటు తప్పనిసరి అవసరం అని తెలిపారు. కొత్తగా మల్యాల లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన గ్రామ పంచాయతీ పాలక మండలిని, ప్రజా ప్రతినిధులను ఎస్పీ అభినందించారు.ఇదే స్ఫూర్తితో మల్యాల పరిసర ప్రాంతాల ప్రజలు కూడా ముందుకు రావాలి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్యాల సీ.ఐ రాజ్ కుమార్,ఎస్.ఐ సందీప్, గ్రామ సర్పంచ్ బోట్ల జయ ప్రసాద్, ఉప సర్పంచ్ కట్కం వినయ్, వార్డ్ సభ్యులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# తుమ్మలచలక గ్రామంలో పిచ్చికుక్క దాడి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలింపు

**(పొనకంటి ఉపేందర్ రావుప్రజాతీర్పు) ఆగస్టు 17**

టేకులపల్లి :సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తుమ్మలచలక గ్రామంలోఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పిచ్చికుక్క దాడి చేసి ఐదుగురిని కరిచింది. ఈ ఘటనలో చీమల నాగరాజు, ఊకే గోపాల్, ఊకే లలిత్, మోహన్ ఎరేం వెంకన్న, బొర్ర స్వామి గాయపడ్డారు.కుక్క కాటుకు గురైన వారిని కుటుంబ సభ్యులు వెంటనే సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా, వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స అందించారు. తీవ్ర గాయాల కారణంగా మెరుగైన వైద్యం, తదుపరి చికిత్స కోసం ఐదుగురిని కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసి తరలించారు.కాగా, తనను కరిచిన కుక్క సమీపంలో ఉన్న చిన్నపిల్లలను కూడా కరిచే ప్రమాదం ఉందని భావించిన ఊకే గోపాల్ ధైర్యంగా ఆ కుక్కను పట్టుకోగా, స్థానిక ప్రజలు సహకరించి దానిని చంపివేశారు. దీంతో మరింతమందికి ప్రమాదం జరగకుండా నివారించగలిగారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ కంచర్ల వెంకటేష్ మాట్లాడుతూ, కుక్క కాటుకు గురైన వెంటనే ఎలాంటి ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యుల సూచనల మేరకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అవసరమైన చికిత్స తీసుకోవాలని ప్రజలకు సూచించారు. కుక్క కాటు గాయాలను వెంటనే సబ్బు, ప్రవహించే నీటితో బాగా కడిగి, వైద్య చికిత్స పొందడం అత్యంత ముఖ్యమని తెలిపారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా లేదా పిచ్చికుక్కలా ప్రవర్తించే కుక్కలు కనిపిస్తే వాటికి దూరంగా ఉండాలని వైద్యాధికారి సూచించారు.



# సింగిల్ యూజ్ ప్లాస్టిక్పై కట్టడి చేయండి ప్రజావాణిలో ఫిర్యాదు

- ప్రజావాణిలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ను కలిసిన సామాజిక, పర్యావరణ ప్రేమికులు


**సూరారం, ఆగష్టు 17 ప్రజా తీర్పు**

కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా కొనసాగుతున్న నేపథ్యంలో సామాజిక, పర్యావరణ ప్రేమికులు కోలా రవీందర్ ముదిరాజ్ ప్రజావాణిలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్ను కలిసి సమస్యను వివరించారు. ఫంక్షన్ హాళ్లు, రైతు బజార్లు, వారాంతపు అంగడులు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, దేవస్థానాలు, క్యాటరింగ్ సెంటర్లలో నాణ్యతలేని సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ప్లాస్టిక్ ఇస్తరాకుల వినియోగం అధికంగా ఉందని తెలిపారు. ముఖ్యంగా ఫంక్షన్ హాళ్లలో వేలాది రూపాయలు అద్దె వసూలు చేస్తూ స్టీల్ ప్లేట్లు అందించకుండా ప్లాస్టిక్ ఇస్తరాకుల్లో భోజనాలు వడ్డిస్తున్నారని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు పశువులు, జలవనరులు, మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. వర్షాలు కురిసిన సమయంలో డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇస్తరాకులు పేరుకుపోవడంతో మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి కాలనీలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఇటీవల హైడ్రా, డ్రైనేజీల శుభ్రత కార్యక్రమాల్లో టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడటం పరిస్థితి తీవ్రతకు నిదర్శనమన్నారు. సమస్యపై స్పందించిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ వెంటనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫంక్షన్ హాల్ యజమానులు, హోటల్ యజమానులు, దేవస్థానాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేయాలని అన్ని సర్కిల్ కమిషనర్లకు సూచించారు. అనంతరం నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణకు వెంటనే స్పందించి చర్యలకు ఆదేశాలు జారీ చేసిన జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్కు కోలా రవీందర్ ముదిరాజ్ ధన్యవాదాలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు అధికారులు, వ్యాపారులు, ప్రజలు సమిష్టిగా సహకరించాలని ఆయన కోరారు.

# పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారమైందా

- కల్యాణ లక్ష్మి రద్దుకు రేవంత్ రెడ్డి కుట్ర...
- తొలి జడ్పీ చైర్పర్సన దావ వసంత సురేష్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగష్టు 17**



ఈరోజు జగిత్యాల జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ఆదేశాల మేరకు జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ ఆధ్వర్యంలో బీడీ కార్మికులకు మరియు వృద్ధులకు కొత్త పెన్షన్లు అందించడంతోపాటు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగించాలని బి ఆర్ ఎస్ నాయకులు, వృద్ధులు, బీడీ కార్మికులు మరియు కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులతో కలిసి నల్ల రిబ్బన్ మరియు బీడీలు చూడుతు నిరసన తెలియజేసి అనంతరం ఆర్డిఓ గారికి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకానికి ఎగనామం పెట్టే ఎగవేతల రేవంత్ రెడ్డి అని అన్నారు. కల్యాణ లక్ష్మి పథకానికి కోర్టు స్టే ఇస్తే దానికి ప్రభుత్వం తరఫున కౌంటర్ దాఖలు చేయకుండా జాప్యం చేయడానికి మర్మం ఏమిటి అని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ఆడబిడ్డలంటే రేవంత్ రెడ్డికి ఎందుకింత అక్కసు అని అన్నారు. కెసిఆర్ మేనమామ లాగా ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం కింద 75 వేల నుండి మొదలుకొని లక్ష 116 ఇచ్చారని అన్నారు. కెసిఆర్ మీద కక్ష తో ఎలాగైనా అధికారంలోకి రావాలని కల్యాణ లక్ష్మి కింద లక్ష రూపాయల చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తా అని ఆశ చెప్పి తులం బంగారం సంగతి పక్కన పెట్టి కనీసం లక్ష రూపాయలు ఇచ్చే పరిస్థితిలో లేరు అని అన్నారు. కెసిఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో నీరు గర్చే ప్రయత్నం చేస్తున్నాడు. రైతు బీమా దళిత బంధు లాంటి అనేక సంక్షేమ పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. వృద్ధులకు బీడీ కార్మికులకు పెన్షన్ల కింద 4000 రూపాయలు ఇస్తానని కెసిఆర్ గారి ఇంట్లో ఒక్క వృద్ధులకు ఇచ్చింంద్రు నేను ఇద్దరి వృద్ధులకు ఇస్తానని మాట ఇస్తే కదా ఇప్పుడు కొత్తగా అప్లై చేసుకునే పెన్షన్లు ఎందుకు వృద్ధులు మరియు బీడీ కార్మికుల పెన్షన్ దరఖాస్తులు పెట్టలేదని అన్నారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ గారి హయాంలో ఇచ్చిన పెన్షన్లు ఇస్తే చాలు అని ప్రజలు అనుకుంటున్నారని అన్నారు. మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు 2500 ఇస్తానని ఎన్నికల సమయంలో మీరే కదా హామీ ఇచ్చారు. వంద రోజుల్లో అమలు చేస్తానన్న హామీలు రెండున్నర సంవత్సరాలైనా కూడా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని అన్నారు. మహిళలతో పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని పథకాల అమలు చేయకపోతే మహిళలతో కలిసి భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కోటిమంది మహిళల కోటీశ్వరులు చేసుడు కాదు ముందుగా ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం కొనసాగించండి.

**కెసిఆర్ ఇచ్చిన కల్యాణ లక్ష్మి ఆపే కుట్రలు ఎందుకు...?**

ఆడబిడ్డ హక్కులను హరించవద్దు, హామీలు కాదు హక్కులు కావాలి పెన్షన్లు కొనసాగించాలి.బీడీ కార్మికుల ఓట్లు కావాలి వారికి పెన్షన్లు వద్దా వృద్ధుల జీవితంతో చెలగాటం ఆడొద్దు... కెసిఆర్ గారు ఇంటికి పెద్ద కొడుకు లెక్క 200 ఉన్న పెన్షన్ను 2000 ఇస్తే రేవంత్ రెడ్డి 4000 ఇస్తానని కొత్తగా అప్లై చేసుకుని పెన్షన్లు వృద్ధాప్య పెన్షన్ ఎందుకు లేదు. రాజకీయ కక్షతో కాకుండా పేద వాళ్ళ పక్షాన ఆలోచించి షాది ముబారక్ కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలని బిఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తాటిపర్తి దేవేందర్ రెడ్డి, మహిపల్ రెడ్డి, శీలం ప్రవీణ్, వొళ్ళం లక్ష్మీ మల్లేశం, గుండా మధు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నాయకులు కార్యకర్తలు కౌన్సిలర్లు తాజా మాజీ ప్రతినిధులు పెన్షన్ రాని బీడీ మహిళా తల్లులు కళ్యాణ లక్ష్మి బాధితులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ అవగాహనలో ప్రతిభచాటిన గీతం విద్యార్థులు

**పటాన్ చేరు, ఆగస్టు 17 ( ప్రజాతీర్పు ప్రతినిధి)**



'సురక్షా కా తిరంగా' కార్యక్రమంలో ప్రముఖ నటుడు అక్కినేని నాగార్జున చేతుల మీదుగా పురస్కారం ఆన్ లైన్ సైబర్ నేరాలను నిరోధించేలా నిర్వహించిన రాష్ట్ర స్థాయి షార్ట్ వీడియో, రీల్ పోటీలో హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థులు అగ్రస్థానం సాధించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) తన స్పార్క్ (అవగాహన, బాధ్యతాయుతమైన సైబర్ స్పేస్ కోసం విద్యార్థి కార్యక్రమం)లో భాగంగా 'సురక్షా కా తిరంగా: అప్రమత్తంగా ఉండండి, క్షుణ్ణంగా తెలుసుకోండి, సైబర్ సురక్షితంగా ఉండండి' పేరిట బంజారాహిల్స్ లోని ఇంటిగ్రెటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో ఈ పోటీలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ టాలీవుడ్ నటుడు అక్కినేని నాగార్జున, తెలంగాణ పోలీసు డైరెక్టర్ జనరల్ సి.వి. ఆనంద్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాదులో పోలీసు కమిషనర్ వి.సి. సజ్జనార్ సహా పలువురు ప్రముఖులు, సీనియర్ పోలీసు అధికారులు హాజరయ్యారు. 'మోసాల నుంచి స్వేచ్ఛ' అనే ఇతివృత్తంతో స్వాతంత్ర్య దినోత్సవ సైబర్ అవగాహన ప్రచారంలో భాగంగా, విద్యార్థులు, ప్రజలు సురక్షితమైన డిజిటల్ పద్ధతులను అవలంబించేలా, సైబర్ బెదిరింపుల పట్ల అప్రమత్తంగా ఉండేలా ప్రోత్సహించడానికి, ఆన్ లైన్ మోసాలను నివారించడంపై అవగాహన కల్పించడానికి టీజీసీఎస్బీ రాష్ట్ర వ్యాప్తంగా ఒక లఘు వీడియో, రీల్ పోటీని నిర్వహించింది. హైదరాబాదు ప్రాంగణంలోని గీతం స్పార్క్ క్లబ్ ఈ రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొని, తమ ప్రభావవంతమైన సృజనాత్మక ప్రదర్శనకు ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. సైబర్ భద్రతను, బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తనను ప్రోత్సహించడంలో వారు చేసిన కృషికి గుర్తింపుగా, ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థులకు ప్రముఖుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. సైబర్ అవగాహన ప్రచారానికి విద్యార్థులు చేస్తున్న కృషికి మద్దతునిచ్చిన సంగారెడ్డి డీఎస్పీ వేణుగోపాలరెడ్డి సహకారంతో గీతం జట్టు ఈ పోటీలలో పాల్గొంది. సురక్షితమైన, మరింత బాధ్యతాయుతమైన డిజిటల్ వాతావరణాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన ఈ పోటీలలో విద్యార్థులు చూపిన సృజనాత్మకత, అవగాహన, చురుకైన భాగస్వామ్యానికి గీతం నాయకత్వం వారిని అభినందించింది. ఈ విజయం, గొప్ప సామాజిక చైతన్యం కల్పించడం కోసం తమ జ్ఞానాన్ని, ప్రతిభను వినియోగించడంలో గీతం విద్యార్థులకున్న నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. గీతం స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ లోని కృత్రిమ మేధస్సు-డేటా సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.శశివర్ధన్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. రాష్ట్ర స్థాయిలో లభించిన ఈ గుర్తింపు గీతంకు గర్వకారణమే గాక, సైబర్ అవగాహన, బాధ్యతాయుతమైన సాంకేతిక వినియోగం, సామాజిక ప్రాముఖ్యత గల కార్యక్రమాలలో విద్యార్థుల భాగస్వామ్యంపై విశ్వవిద్యాలయం నిరంతరం చూపుతున్న ప్రాధాన్యతను ఇది నొక్కి చెబుతుంది.




# ఆగస్టు 17 బహుజనుల హక్కుల దినంగా ఘనంగా జరుపుకుందాం

- దళిత సంఘాల ఐక్య వేదిక

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 17**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చౌరస్తా లో దళిత సంఘాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి,గోమాస రాజం, అధ్యక్షతన బహుజనుల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు,దళిత సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు చిలుక రాజనర్సు మాట్లాడుతు వందల సంవత్సరాలుగా బహుజనులు చదివితే నాలుక,కోసెయ్యాలి, చదువు వింటే మరుగుతున్న సీసం చెవిలో పోసి చంపేయాలని వేలాది సంవత్సరాలుగా ఈ నిబంధనలు నడుస్తున్న మన దేశంలో ఈ రోజు మనకు ఉచిత చదువులు ఎలా వచ్చాయో మన బహుజనులు ఎప్పుడైనా ఆలోచించారా? అని అన్నారు వందల సంవత్సరాలుగా ఊరి చివరకు,నెట్టివేయబడి,

ఒంటి నిండా గుడ్డ కట్టుకొనీయకుండా,కడుపు నిండ తిండి తిననీయకుండా, పశువుల కంటే హీనమైన మన జీవితాలకు ఈ గౌరవం ఎలా లభించిందో మన బహుజనులు తెలుసుకోవలసిన అవసరం ఉందని అన్నారు డిగ్రీలు పీజీలు,ఇంజనీరింగులు, డాక్టర్లు,లాయర్లు, కలెక్టర్లు చదువుతున్న మన బహుజనులు విద్యార్థులు తెలుసుకోవలసిన అవసరం ఉందని అన్నారు కోట్లు గడించిన భూస్వాములు మాత్రమే పాలకులుగా ఉండాలని నిర్దేశించిన కాల గతిని మార్చి దళితులు గ్రామ,సర్పంచ్, ఎంపీటీసీ జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ మంత్రులుగా,రాష్ట్రపతులుగా, ఎన్నుకోబడుతున్నారంటే అది కేవలం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్పించిన హక్కులు అని అన్నారు అఖండ ప్రజాస్వామ్య భారత దేశాన్ని నిర్మించిన ప్రపంచ మేధావి,పరమ పూజ్యులు బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, తన నలుగురు 4 పిల్లల ఆకలి చావులపై మనకు సాధించి పెట్టిన హక్కులు అని అన్నారు భారత దేశానికి రాజ్యాంగం రాయడానికి 18 సంవత్సరాల ముందే అంటే 1932 ఆగస్టు 17 తేదీన మెక్ డొనాల్డ్,అధ్యక్షతన జరిగిన 2వ రౌండ్ టేబుల్ సమావేశంలో కమ్యునల్ అవార్డ్ ద్వారా మనకు ఈ హక్కులను సాధించి పెట్టాడని అన్నారు. ఈ దేశ బహుజనులు అందరూ కూడా ఆగస్టు 17 తేదీని మన హక్కుల సాధన దినంగా జరుపుకుందాం.అని అన్నారు ఈ కార్యక్రమంలో బత్తుల రాజలింగు ఉపాధ్యక్షుడు కారెంగుల మల్లేష్,కార్యదర్శి,దాసరి బానయ్య,కోశాధికారి, కామెర దుర్గయ్య,భోగే రాజయ్య,కార్యదర్శి, గోగర్ల శేఖర్,కార్యదర్శి, బొంకురి రామచందర్, కడపాక శంకర్,గద్దల ధర్మేంద్ర,కుమారస్వామి, రాజేష్,తదితరులు పాల్గొన్నారు

# తాడు ఆట పేరుతో భక్తులను మోసం చేస్తున్న ఇద్దరు ఉక్కుపాదం

- వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 17**



హనుమకొండ జిల్లా ఐనవోలు గ్రామనికి చెందిన సురేందర్ మరియు హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన దేవేందర్ అనే ఇద్దరు వ్యక్తులు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని "తాడు ఆట" పేరుతో జూదం నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసి తాడు ఆట నిర్వహిస్తున్న ప్రదేశంపై దాడి చేసి తాడు ఆటతో జూదం నిర్వహిస్తున్న సురేందర్ మరియు దేవందర్ లను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి తాడు ఆటకు ఉపయోగించే సామగ్రి, అప్సర పెన్సిళ్లు, నగదు రూ.2,000/-ను స్వాధీనం చేసుకొని ఈరోజు రిమాండ్ కి తరలించడం జరిగిందన్నారు. భక్తులు అధికంగా వచ్చే ప్రాంతాల్లో అమాయక భక్తులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడటం, జూదం నిర్వహించడం, ఇతర చిన్నచిన్న నేరాలకు పాల్పడటం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని వేములవాడ టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తెలిపారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సి.ఐ సూచించారు.

# శృంగేరి శారదా పీఠాధీశ్వరులకు వేములవాడ దేవస్థానం తరపున పట్టువస్త్రాల సమర్పణ

**(కొమురవెల్లి మునీష్ ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్టు 17**




దక్షిణామ్నాయ శృంగేరి శారదా పీఠాధీశ్వరులు, అనంత విభూషితులు జగద్గురు శ్రీ శ్రీ శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామివారి 34వ పీఠారోహణ వార్షికోత్సవం సందర్భంగా, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను ఘనంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం తరఫున ఆలయ అర్చకులు పాల్గొని, జగద్గురువారికి శుభాకాంక్షలు తెలియజేసి, శ్రీ స్వామివారి ఆశీర్వాదాలను పొందారు.

# కమ్యూనల్ అవార్డు.. అంబేడ్కర్ రాజకీయ పోరాటానికి చారిత్రక మైలురాయి

- ప్రత్యేక నియోజకవర్గాల కోసం బాబాసాహెబ్ పోరాటం
- పూనా ఒప్పందంతో కీలక హక్కులు కోల్పోయాం
- బహుజనులు చరిత్రను అధ్యయనం చేయాలి: డా. మార్షల్ దుర్గం నగేష్

**పెద్దపల్లి ప్రతినిధి, ఆగస్టు 17, (ప్రజా తీర్పు)**



దేశ రాజకీయ చరిత్రలో ఆగస్టు 17, 1932కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని, అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాగించిన పోరాటానికి కమ్యూనల్ అవార్డు ఒక కీలక మైలురాయిగా నిలిచిందని సమతా సైనిక్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. అంబేద్కర్ రాజకీయ దూరదృష్టి, పోరాట పటిమ ఫలితంగానే అణగారిన వర్గాల రాజకీయ హక్కుల ప్రశ్న బ్రిటిష్ రాజ్యాంగ చర్చల్లో కీలక అంశంగా మారిందని పేర్కొన్నారు. 1932 ఆగస్టు 17న బ్రిటిష్ ప్రధాని రామ్సే మెక్‌డొనాల్డ్ కమ్యూనల్ అవార్డును ప్రకటించారు. ఇందులో 'డిప్రెస్డ్ క్లాసెస్'గా పేర్కొన్న అణగారిన వర్గాలకు కేంద్ర, ప్రావిన్షియల్ శాసనసభల్లో ప్రత్యేక నియోజకవర్గాల విధానాన్ని కల్పించారు. ఈ నిర్ణయం అంబేద్కర్ కోరిన రాజకీయ రక్షణల్లో అత్యంత కీలకమైన అంశంగా మారింది.

## రాజకీయ ప్రాతినిధ్యమే రక్షణ కవచం

అంబేద్కర్ దృష్టిలో కేవలం సామాజిక సంస్కరణలు సరిపోవని, శాసనసభల్లో అణగారిన వర్గాలకు స్వతంత్ర రాజకీయ ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉందని నగేష్ అన్నారు. 1930లోనే అంబేద్కర్, రావు బహదూర్ ఆర్. శ్రీనివాసన్‌తో కలిసి అణగారిన వర్గాల రాజకీయ రక్షణలపై సమగ్ర ప్రతిపాదనలు రూపొందించారు. అందులో ప్రత్యేక నియోజకవర్గాలు, శాసనసభలు, మంత్రివర్గాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. అయితే ప్రత్యేక నియోజకవర్గాల విషయంలో మహాత్మా గాంధీ తీవ్రంగా వ్యతిరేకించడంతో రాజకీయంగా తీవ్ర ఉద్రిక్తత ఏర్పడిందని నగేష్ తెలిపారు. కమ్యూనల్ అవార్డులోని ప్రత్యేక నియోజకవర్గాల నిబంధనను వ్యతిరేకిస్తూ గాంధీ 1932 సెప్టెంబర్ 20న నిరాహార దీక్ష చేపట్టారు. అనంతరం అంబేద్కర్, గాంధీ తదితర నాయకుల మధ్య చర్చల ఫలితంగా సెప్టెంబర్ 24న పూనా ఒప్పందం కుదిరింది. ప్రత్యేక నియోజకవర్గాలకు బదులు ఉమ్మడి నియోజకవర్గాలు పూనా ఒప్పందంతో అణగారిన వర్గాలకు ప్రత్యేక నియోజకవర్గాల విధానం తొలగిపోయి, ఉమ్మడి నియోజకవర్గాల్లో రిజర్వ్ సీట్ల విధానం అమల్లోకి వచ్చిందని నగేష్ వివరించారు. అయితే కమ్యూనల్ అవార్డుతో పోలిస్తే రిజర్వ్ స్థానాల సంఖ్య 148కి పెరిగిందని, అదే సమయంలో ప్రత్యేక నియోజకవర్గాల ద్వారా లభించే స్వతంత్ర రాజకీయ స్వరం మాత్రం కోల్పోయామని ఆయన పేర్కొన్నారు. అంబేద్కర్ స్వయంగా పూనా ఒప్పందంపై తరువాత కూడా అసంతృప్తి వ్యక్తం చేశారని, ప్రత్యేక నియోజకవర్గాలు రాజకీయ సాధికారతకు కీలకమైన సాధనంగా ఆయన భావించారని నగేష్ అన్నారు.

## చరిత్రను తెలుసుకోవాల్సిన బాధ్యత బహుజనులదే

నేటి తరానికి అంబేడ్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కాకుండా, అణగారిన వర్గాలకు రాజకీయ హక్కులు, ప్రాతినిధ్యం, సమానత్వం కోసం పోరాడిన నాయకుడిగా పరిచయం చేయాల్సిన అవసరం ఉందని డా. మార్షల్ దుర్గం నగేష్ అన్నారు. రాజకీయ పార్టీల జెండాలకు పరిమితం కాకుండా బహుజనులు తమ చరిత్రను చదవాలని, అంబేద్కర్ పోరాటాల వెనుక ఉన్న రాజ్యాంగ, రాజకీయ ఆలోచనలను అర్థం చేసుకోవాలని సూచించారు. కమ్యూనల్ అవార్డు, పూనా ఒప్పందం వంటి చారిత్రక ఘట్టాలను వాస్తవ ఆధారాలతో అధ్యయనం చేసి, నేటి సామాజిక-రాజకీయ పరిస్థితులతో అనుసంధానం చేసుకోవాలని పిలుపునిచ్చారు. "రాజకీయ అధికారం లేకుండా సామాజిక విముక్తి అసంపూర్ణం. అంబేడ్కర్ చూపిన మార్గాన్ని అధ్యయనం చేసి, రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు బహుజనులు ఐక్యంగా ముందుకు సాగాలి" అని డా. మార్షల్ దుర్గం నగేష్ అన్నారు.



# నూతన పెన్షన్ దరఖాస్తుదారుల సమస్యలపై ఇల్లందు ప్రజావాణిలో వినతి

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 17**

ఇల్లందు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నూతన ఆసరా పెన్షన్ దరఖాస్తుదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ నాయకులు ఉల్లింగ సతీష్, స్థానిక 16వ వార్డు కౌన్సిలర్ ఉల్లింగ విజయలక్ష్మి లెటర్‌హెడ్‌పై సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.నూతన పెన్షన్ దరఖాస్తుదారులకు ఆదాయ ధ్రువీకరణ పత్రం పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రేషన్ కార్డును ప్రామాణికంగా పరిగణనలోకి తీసుకుని, అర్హత కలిగిన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగ వితంతువులు,ఒంటరి మహిళలు,వికలాంగులు, తాటి/కల్లు గీతకార్మికులు,చేనేతకార్మికులు, డయాలసిస్ చేయించుకునే వారు, అర్హులైన లబ్ధిదారులకు ఈ ప్రక్రియ సులభతరం చేయాలని అధికారులను కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు సమస్యలను పరిశీలించి, అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన దుర్గం రామాంజనేయులుకు అశ్రునివాళి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 17**



సోమవారం జరిగిన విషాదకరమైన విద్యుత్ ప్రమాదంలో అసిఫాబాద్ కొమరం భీమ్ జిల్లా దహెగాం మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త దుర్గం రామాంజనేయులు మృతి చెందడం ఎంతో బాధాకరం. ఆయన మృతితో గ్రామంలో తీవ్ర విషాదం వారి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ నాయకులు కొమురవెల్లి శ్రీధర్,దహన సంస్కారాల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొంచవెల్లి గ్రామ సర్పంచ్ కొమురవెల్లి ప్రశాంత్, కొమురవెల్లి సంతోష్,తాజా మాజీ ఎంపీటీసీ గౌరే రాకేష్,గడ్డం తిరుపతి గౌడ్, మామిడి భీమేష్,బోయనపల్లి సాయి కృష్ణ,శెనిగరపు సాయి, తదితరులు దుర్గం రామాంజనేయులు,వారి పార్థివదేహానికి అశ్రునివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని,ప్రసాదించాలని కోరుకుంటున్నారు.



# ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం..

- ఎమ్మెల్యే మెడిపెల్లి సత్యం..
- ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్...

**(గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఆగస్టు 17**

టీ.ఆర్. నగర్, రాజారం గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా శ్రీ సత్యసాయి సుజల స్రవంతి ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన సాయి స్వస్థ షా హ్యాపినెస్ అర్జెంట్ కేర్ సెంటర్ను శాసన సభ్యులు మేడిపల్లి సత్యం, శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్, జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగిత్యాల మరియు మల్యాల నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల ప్రజలకు పూర్తిగా ఉచిత అత్యవసర వైద్య సేవలు అందించేందుకు ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు సకాలంలో వైద్యం అందించడం ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పనిచేస్తున్నారని, సేవా సంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే పాలనతో పాటు, ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వారు పేర్కొన్నారు. టీ.ఆర్. నగర్, రాజారం గ్రామంతో పాటు జగిత్యాల--మల్యాల పరిధిలోని గ్రామాల ప్రజలు ఈ ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ దినేష్, డి సి సి అధ్యక్షుడు గాజంగి నందయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సమ్మయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన : రాణా ప్రతాప్ రెడ్డి

**నర్సంపేట టౌన్ ఆగస్టు 17 ప్రజా తీర్పు**



నర్సంపేట నియోజకవర్గం, నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన లిచింత రాజు తండ్రి లిచింత సమ్మయ్య ఇటీవల మృతి చెందిన విషయం తెలిసి సమ్మయ్య చిత్ర పటానికి నివాళులు అర్పించి,వారి కుటుంబసభ్యులను పరామర్శించిన లిభారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా॥ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,జిల్లా నాయకులు,సీనియర్ నాయకులు,ముఖ్య నాయకులు,గ్రామా కమిటీ సభ్యులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల వైవిధ్యీకరణపై దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఆగస్టు 17**



రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశానికి నీటిపారుదల శాఖ ఎస్.ఈ. విష్ణు ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం, భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం వంటి పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంటల వైవిధ్యీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్‌తో పాటు రానున్న రబీ సీజన్‌లోనూ నీటి లభ్యత విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న నీటిని మొదటి ప్రాధాన్యతగా త్రాగునీటి అవసరాలకు వినియోగించాల్సిన పరిస్థితి ఉందని, గొల??లవాగు ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టులలోనూ వరి సాగుకు అవసరమైన స్థాయిలో నీరు అందుబాటులో ఉండే అవకాశం లేదని తెలిపారు. వరి పంటకు ఒక ఎకరాకు అవసరమయ్యే నీటితో సమానమయ్యే నీటిని వినియోగించి సుమారు 3 నుంచి 4 ఎకరాలలో ఆరు తడి పంటలను సాగు చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి నాట్లు వేస్తే పంటకు అవసరమైన నీరు పూర్తిస్థాయిలో అందకపోవడంతో పంట ఎండిపోయే ప్రమాదం, దిగుబడి తగ్గడం, ధాన్యం నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. నీటి కొరత కారణంగా వరి గింజ పరిమాణం తగ్గి, దిగుబడి తగ్గడంతో పాటు పంటను మార్కెట్‌లో విక్రయించడంలోనూ రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి తక్కువ నీటితో సాగు చేయగల పంటలను రైతులు ఎంచుకోవాలని, ఈ పంటలకు అవసరమైన మేరకు నీటిని అందించగలిగే అవకాశం ఉన్నందున పంటలు విజయవంతంగా సాగయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. పప్పుధాన్యాల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు అవసరమైన విత్తనాలను కూడా అందించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు తదితర పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పిస్తోందని, మొక్కజొన్నకు బహిరంగ మార్కెట్‌లో గరిష్ట మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని తెలిపారు. నీటి లభ్యత, వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జూన్ 1వ తేదీ నుంచే రైతులకు పంటల ఎంపికపై అవగాహన కల్పిస్తున్నామని, అయినప్పటికీ కొంతమంది రైతులు వరి సాగు చేయాలని నిర్ణయిస్తే భవిష్యత్తులో నీటి కొరత కారణంగా ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. భూగర్భ జలమట్టాలు తగ్గిన నేపథ్యంలో బోర్లపై ఆధారపడే రైతులు సైతం నీటి సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉందని, రైతులు పరిస్థితులను అంచనా వేసి నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత నీటి పరిస్థితులపై రైతులకు వాస్తవ పరిస్థితిని వివరించి, పంటల వైవిధ్యీకరణపై అవగాహన కల్పించడంలో మీడియా సంస్థలు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాలలో నీటి లభ్యత, వర్షపాతం విషయంలో అనిశ్చిత పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టడం అవసరమని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగిస్తూ ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించాలంటే వరికి బదులుగా తక్కువ నీటితో సాగు చేసే పంటలను ఎంచుకోవాలని, ప్రస్తుత పరిస్థితులలో వరి సాగు చేసి నీటి కొరతతో పంట నష్టపోయే కంటే మొక్కజొన్న, కంది, పెసలు, మినుములు, అలసందులు వంటి పంటలను సాగు చేయడం రైతులకు ప్రయోజనకరమని తెలిపారు. రైతులు నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని, వ్యవసాయ, వ్యవసాయ విస్తరణ, సాగునీటి శాఖల అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నాగుల చవితి వేడుకలు

- కోరుట్లలో కన్నుల పండువగా పూజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

**కోరుట్ల ఆగస్టు 17 (ప్రజాతీర్పు)**

శ్రావణ సోమవారం, నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కోరుట్ల పట్టణంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పట్టణంలోని పలు ఆలయాలకు తరలివచ్చి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహదేవ దేవాలయం, పెద్దమ్మ దేవాలయం, సాయిబాబా మందిరం, అర్బన్ కాలనీలోని దుర్గామాత దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని పాలు, పసుపు, కుంకుమ తదితరాలతో నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబ సభ్యులకు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని నాగదేవతను భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నాగుల చవితి సందర్భంగా పట్టణమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## నక్సల్స్ నియంత్రణలో విశేష సేవలు - నిరంజన్ రెడ్డికి ఐపీఎం

**కరీంనగర్, ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**



నక్సల్స్ కార్యకలాపాల నియంత్రణ, అసాంఘిక శక్తుల కట్టడిలో విశేష సేవలు అందించిన కరీంనగర్ రూరల్ సీఐ అనుముల నిరంజన్ రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్ లభించడంతో అభినందనలు వె ల్ల వె త్తు తు న్నా యి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నిరంజన్ రెడ్డి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో 4వ డివిజన్ నాయకులు, దుర్శేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు నిరంజన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. సమాజ హితం కోసం నిస్వార్థంగా సేవలందిస్తున్న పోలీసు అధికారులకు ఇలాంటి అరుదైన పురస్కారాలు దక్కడం ఎంతో సంతోషకరమని సంపత్ రావు పేర్కొన్నారు. నిరంజన్ రెడ్డికి ఇండియన్ పోలీస్ మెడల్ దక్కడం కరీంనగర్ జిల్లాకు గర్వకారణమని, భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## హల్ద్వానీ ఘటనను ఖండిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ధర్నా

**కరీంనగర్ అగస్టు 17 (ప్రజాతీర్పు)**



హల్ద్వానీలో జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం సమీపంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కరీంనగర్ గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ హల్ద్వానీ ఘటనను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ హల్ద్వానీ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని పేర్కొన్నారు. ధర్నాలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని హల్ద్వానీ ఘటనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## మేడారం సమ్మక్క - సారలమ్మ లను దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి...

- ఆ సందర్భంలో మర్యాదపూర్వకంగా కలిసిన కురవి మండల టైగర్ గార్లపాటి వెంకటరెడ్డి...

**కురవి ఆగస్టు 17(ప్రజా తీర్పు విలేఖరి)**



తెలంగాణ లో విస్తృత పర్యటన సందర్భంగా ములుగు జిల్లా లో సీఎం రేవంత్ రెడ్డి సమ్మక్క - సారలమ్మ గద్దెల ను దర్శించుకున్న అనంతరం వితంతు మహిళల చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ములుగు జిల్లా మేడారం సమ్మక్క-సారలమ్మ దేవస్థాన ప్రాంగణంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశం,సంక్షేమ కార్యక్రమాల్లో డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డా.రామచంద్రు నాయక్,మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, మహబూబాబాద్ ఎమ్మెల్యే డా.మురళి నాయక్,మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిసిన గార్లపాటి వెంకట్ రెడ్డి,జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలు మరియు కాంగ్రెస్ పార్టీ బలోపేతంపై చర్చించారు. అనంతరం ముఖ్యమంత్రి తో కలిసి వన దేవతలైన సమ్మక్క - సారలమ్మ గద్దెలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వనదేవతల ఆశీస్సులతో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అర్హులైన వితంతు మరియు ఒంటరి మహిళలకు ఒక్కరికి రూ. 2016/- రూపాయల చొప్పున ఇరవై నాలుగు మందికి చెక్కులను ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందజేయడంతో పాటు,నూతన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి వెంకట్ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు అభినందనలు తెలిపారు.



## సీసీటీఎన్ఎస్ 2.0, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించాలి

- ఇల్లందు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) ఆగస్టు 17**

ఇల్లందు :జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఇల్లందు పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అధికారులు, సిబ్బందితో స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను బాధ్యతగా పరిష్కరించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్టికల్స్ వారీగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి పనితీరు, విధుల నిర్వహణ తీరును పరిశీలించారు.

సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్ వినియోగంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగావినియోగించుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ, సంబంధిత వ్యక్తుల కదలికలు మరియు కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలు సైబర్ మోసాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్-112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ సురేష్, ఎస్సైలు ఉమా, సారంగపాణి మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఫర్టిలైజర్ యాప్ ను వెంటనే రద్దు చేయాలి రైతులు ఆందోళన

- దిక్కుతోచని స్థితిలో రైతులు చదువురాని వారికి ఇబ్బందిగా మారిన ఆన్లైన్ బుకింగ్
- ఫర్టిలైజర్ యాప్ కంటే చెప్పుల లైన్లోనైనా ఒకటి రెండు బస్తాలు దొరికేవి అని రైతులు ఆందోళన

**(వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్ ) ఆగస్టు 17**

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు యాప్ లో పెట్టిన ఐదు పది నిమిషాల లోపే నో స్టాక్ అని అనిపించడంతో చదువురాని రైతులు వారికి ఏ విధంగా యూరియా తీసుకోవాలో తెలియకపోవడం. ఇతర మండలాలు రైతులు బుక్ చేసుకోవడంతో వేరే మండలాలు రైతులు మన మండలం కి బుక్ చేసుకోవడంతో ఇబ్బంది మరీ తీవ్రంగా మారింది మేము వేరే దగ్గరికి వెళ్లి తెచ్చుకోవడం వల్ల దూరాభారం ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ప్రజావాణి కావడంతో అక్కడే ఉన్న అధికారులకు తమ గోడును వెళ్ళబోసుకున్నారు. అగ్రికల్చర్ మండల ఆఫీసర్ కవితను రైతులు నిలదీశారు ఇతర మండలానికి పోతే అక్కడ క్యాన్సల్ చేస్తున్నారని ఇవ్వడం లేదని రైతులు అధికారులతో వాగ్వాదం పెట్టుకున్నారు. ఎంఏఓ కవిత మాట్లాడుతూ ప్రభుత్వం ఎక్కడి నుండైనా ఏ రైతైనా బుక్ చేసుకోవచ్చని బుక్ చేసుకున్న వారికి మేము తప్పనిసరిగా ఇవ్వవలసి ఉంటుందని రైతులకు తెలిపారు.

### రైతులకు మాజీ సర్పంచ్ చిట్టిమిల నాగరాజు మద్దతు

రైతులు ఆందోళన తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ చిట్టిమీల నాగరాజు రైతుల పక్షాన ఎంఈఓ కవితను వివరణ అడిగి వారి కష్టాలను వెంటనే తీర్చాలని ఎక్కడ మండలానికి అక్కడే యూరియా సప్లై చేయాలని పై అధికారులకు వీరి కష్టాలను చెప్పాలని రైతుల డిమాండ్ చేశారు అనంతరం ప్రజావాణిలో ఫర్టిలైజర్ యాప్ పై ఫిర్యాదు చేశారు ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ స్థానిక నాయకులు మరియు మండల వివిధ గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి బీఆర్ఎస్ ర్యాలీ

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) ఆగస్ట్ 17**

- ధర్నా మరియు తాహశిల్దార్ కు వినతి పత్రం అందజేతలి
- పేద కుటుంబాలకు ఆసరాగా నిలిచే కళ్యాణలక్ష్మిని రద్దు చేసే కుట్రను విరమించుకోవాలి:బీఆర్ఎస్ పార్టీ డిమాండ్



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చెల్మెడ లక్ష్మీనరసింహారావు గారి ఆదేశాలతో పట్టణ బిఆర్ఎస్ శ్రేణులు తెలంగాణ ప్రభుత్వం హైకోర్ట్ లో ప్రైవేటు వ్యక్తి ఉచితాలు రద్దు చేయాలని ప్రజా ప్రయోజనాల వాజ్యం దాఖలు చేస్తే ఉచిత పథకాలు ఏందుకు కొనసాగాలంటూ ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయమానీ నోటీస్ లు ఇస్తే నెలదాటిన ప్రభుత్వ న్యాయవాదులు ఇంతవరకు స్పందించకుండా పేదింటి ఆడబిడ్డల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన అంశంలో ప్రభుత్వం సరైన వాదనలు ఎందుకు వినిపించలేకపోయిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పూర్తిగా రద్దు చేయాలనే కుట్ర జరుగుతుందని మాజీ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి-రాజు,సినియర్ నాయకులు నిమ్మశెట్టి విజయ్ ఆరోపించారు కళ్యాణలక్ష్మి,షాదిముబారక్ పథకాన్ని 2014లో అక్టోబర్ 2న మేనిఫెస్టోలో పెట్టకున్నా ఎస్సి,ఎస్టీలకు,మైనారిటీ మొదటగా 51,000లు క్రమక్రమంగా 75,000లు ఆందరికి 1,00,116లు గత ప్రభుత్వం పేదలకు అందించిందని ఈ పథకాన్నీ యథావిధిగా కొనసాగిస్తూ మెనిఫెస్టోలో పెట్టిన ప్రకారం లక్షతో పాటు తులం బంగారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలో పార్టీ శ్రేణులు పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లారు. 2023 లో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఈ సంవత్సరం డిసెంబర్ 9 తారిఖూ లక్షతో పాటు తులం బంగారం ఇస్తా అనీ మహిళల ఓట్లు దండుకోనీ ప్రభుత్వం వచ్చాక మహిళలందరిని మోసం చేశారనీ అన్నారు. నాడు కెసిఆర్ ప్రభుత్వం తల్లి,బిడ్డల సంక్షేమం కోరకు గర్భిణిలకు అంగన్వాడీ సెంటర్లో న్యూట్రిషన్ కీట్,కెసిఆర్ కిట్ పథకం రద్దు చేశారనీ పేదలకు అర్ధిక భారం కాకుండా అండగా ఉండే ఈ సంక్షేమ పథకాన్నీ కూడా తొలగించేందుకు రేవంత్ సర్కార్ కుట్ర చేస్తోందని ఆరోపిస్తూ, ప్రభుత్వం తమ వైఖరిని మార్చుకోవాలని నాయకులు ధర్నా చేస్తూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం తహసీల్దార్‌ను కలిసి ప్రభుత్వానికి కళ్యాణ లక్ష్మి,షాదిముబారక్ కోనసాగేలా నివేదిక పంపాలని తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. పేద, మధ్యతరగతి కుటుంబాల ఆడపిల్లల పెళ్లిళ్లకు ఈ పథకాలు ఎంతో ఆసరాగా నిలిచాయని బీఆర్ఎస్ మహిళ కౌన్సిలర్లు ఏనుగు జ్యోతి,వెంగళ అనితలు పేర్కొన్నారు. కెసిఆర్ ఇచ్చిన కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలను ఎలాంటి కుట్రలు చేయకుండా లబ్ధిదారులందరికీ లక్షతో పాటు తులం బంగారం సహాయం అందేలా పథకాలను కొనసాగించాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రజా పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు నిరసన కార్యక్రమంలో కౌన్సిలర్లు వాసాల లావణ్య-శ్రీనివాస్, ఏనుగు తిరుపతిరెడ్డి,వెంగళ శ్రీకాంత్ గౌడ్,మాజీ కౌన్సిలర్లు గూడూరి మధు, సిరిగిరి రాంచందర్,మారం కుమార్,కోండ నర్సయ్య,రేగుల రాజేశం,పెద్ది రాజు,గోస్కుల నర్సయ్య,ఉల్లెందుల హన్మంత్,మహిళ నాయకురాళ్లు మొట్టల అనూష,జంగిటి శ్రీనిధి,పెద్ది లలిత,మంతె సందిప్,సుంకపాక రాజు,వెంకట్ రెడ్డి,సత్తిరెడ్డి, నిమ్మశెట్టి రాజు,కనకయ్య,రాధకిషన్ రావు,జంగిటి సంజీవ్,బోల్లం దేవరాజు, జడల చిన్న శ్రీనివాస్, బోజ్జ శ్రీనివాస్,పబ్బ మహేశ్,నీరటి మల్లేశం, ఆంజత్ పాషా, రఫిక్,నాగుల రాము, అసద్,హరిష్, ఆరుణ్,కిరణ్,ప్రవిణ్, చంద్రమోహన్ మహిళలు ఉన్నారు.

# రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటా
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**రామడుగు, ఆగస్టు 17 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలని, సింగిల్‌విండోలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి సోమవారం వచ్చిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గజమాలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ ఆవరణలో నూతనంగా నిర్మించిన మార్కెట్ భవనాన్ని ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. తదనంతరం గోపాల్‌రావుపేటలోని శు భం గార్డెన్స్‌లో రామడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్, పాలకవర్గ ఆశీర్వాద సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నూతనంగా ఎన్నికైన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటానని అన్నారు. నూతనంగా ఏర్పాటైన పాలకవర్గం రైతుల పట్ల నిబద్ధతతో పనిచేస్తూ వారిలో విశ్వాసం కలిగించేలా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సింగిల్‌విండో ద్వారా రైతులకు అందించే ఎరువులు, విత్తనాలు, పంట రుణాల పంపిణీని మరింత సులభతరం చేయడంపై నూతన కమిటీ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ రామడుగు సింగిల్‌విండోను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కోల రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ జవ్వాజి హరీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుమల తిరుపతి, గోపాల్‌రావుపేట సర్పంచ్ ఎడవల్లి వనజ నరేందర్, చొప్పదండి సింగిల్‌విండో చైర్మన్ ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకులు, రైతులు, ప్రజాప్రతినిధులు, ఆరు మండలాల కాంగ్రెస్ కుటుంబ సభ్యులు, పలు గ్రామాల సర్పంచులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్‌విండో చైర్మన్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



# గార్లలో ప్రజావాణి కార్యక్రమం

- ప్రజల సమస్యల పరిష్కారానికి వినతిపత్రాల స్వీకరణ

**(పడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి) ఆగస్టు 17**

గార్ల: ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానికమండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మంగమ్మ, తహసీల్దార్ శారద సంయుక్తంగా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. భూ సమస్యలు, ప్రభుత్వ పథకాలు, పెన్షన్లు, మౌలిక వసతులు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అందిన వినతిపత్రాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు.



# యువత ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా రవాణా శాఖ అధికారి యోగేశ్వర్ జాదవ్

**సిద్దిపేట జిల్లా ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**

18 సంవత్సరాలు నిండిన యువకులు సిద్దిపేట పట్టణంలో కె.వి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్ రావు ఏర్పాటుచేసిన ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి యోగేశ్వర్ జాదవ్ సూచించారు. కెవిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మూడవ ఉచిత డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని వంశిధర్ రావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం వంశీధరావు మాట్లాడుతూ గతంలో నంగునూరు మండలంలో, చిన్నకోడూరు మండలంలో డ్రైవింగ్ ఉచిత శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణంలో మూడవ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించుకున్నామని, 18 సంవత్సరాల నుండి 19 సంవత్సరంలోకి వచ్చిన యువకులకు ప్రాముఖ్యతను ఇచ్చి, డ్రైవింగ్ నేర్పిస్తున్నామని, లైసెన్స్ కూడా ఇప్పిస్తామని అన్నారు. లైసెన్స్ లేకుండా ప్రయాణాలు చేసిన సమయంలో అనుకోని ఘటనలు జరిగినప్పుడు కోర్టులలో పోలీస్ స్టేషన్ లలో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, యువకులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని సూచించారు. ఇలాంటి శిక్షణ కేంద్రాలు నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, యువకులు మరియు పలువురు పాల్గొన్నారు...



# మౌలాలిలో వైభవంగా బోనాల వేడుకలు

- అమ్మవారి ఆశీస్సులు పొందిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**(వినోద్, ప్రజాతీర్పు, ?మౌలాలి మేడ్చల్) ఆగస్టు 17**

మౌలాలి డివిజన్ (186వ డివిజన్) హనుమాన్ నగర్‌లోని అధ్యక్షులు పోతుల వినోద్ యాదవ్ నివాస ప్రాంగణంలో బోనాల పండుగ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా నిర్వహించబడ్డాయి. భక్తుల కోలాహలం నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ?ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే, మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి దివ్య ఆశీస్సులు అందుకున్నారు. ?అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ.. అమ్మవారి దయాకటాక్షాలతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ బోనాల ఉత్సవాల్లో స్థానిక మహిళలు, యువత, కాలనీవాసులు మరియు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ప్రమోద్ గౌడ్ ను సన్మానం చేసిన మోకుదెబ్బ రమేష్ గౌడ్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 17 ప్రజా తీర్పు**

వరంగల్ ఎంజిఎం సూపరిండెంట్ గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన మచ్చిక ప్రమోద్ గౌడ్ ను గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్ సోమవారం శాలువ, బొకే తో సన్మానం చేయడం జరిగింది. గతం లో కాకతీయ మెడికల్ కాలేజీ పనిచేసిన ప్రమోద్ గౌడ్ ఇటీవల ఎంజిఎం లో బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ దార కుమారస్వామీ పాల్గొన్నారు.



# 4 పిల్లలను దత్తతతీసుకున్న మూడు రాష్ట్రల దంపతులు

**సిద్దిపేట జిల్లా ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో సిద్దిపేట జిల్లాలో సోమవారం రోజున సిద్దిపేట శిశు గృహాలో ఉన్న 4 పిల్లలను కేరళ, కర్ణాటక, తెలంగాణ,రాష్ట్రలకు చెందిన దంపతులకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కే. హైమావతి చేతుల మీదుగా అధికారికంగా దత్తతను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను బాగా చదివించాలి తనకు ఇష్టమైన రంగంలో ప్రోత్సహం ఇవ్వాలి పిల్లలకు బంగారు భవిషత్ కు బాట వేసే పూర్తి బాధ్యత మీదే అని చెప్పడం జరిగింది మరియు జిల్లాలోని పిల్లలు లేని దంపతులు దత్తత తీసుకోవాలనుకుంటే సిద్దిపేటలో గల శిశు గృహ/ జిల్లా బాలల పరిరక్షణ విభాగం ద్వారా అధికారికంగా దరఖాస్తు చేసుకోవాలని తద్వారా ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జష్ట్ర శారద , జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎ. రాము మరియు శిశు గృహ మేనేజర్ రాజు, సామాజిక కార్యకర్త రాజారాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మాసాయిపేట్ మండల కేంద్రంలో ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

- సమస్యలు ఫిర్యాదులకు వేదిక ప్రజావాణి సమస్య గ్రామస్థాయిలోని పరిష్కారం

**(వంజరపు ఎల్లం ప్రజాతీర్పు ప్రతినిధి మాసాయిపేట్) ఆగస్టు 17**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ మాసాయిపేట్ మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు వచ్చాయని ఎంపీ ఓ నరేష్ వెల్లడించారు. మొదటి ఫిర్యాదు 33 కెవి లైన్ ఊరు మధ్యలో నుండి వెళుతుండడంతో రేడియేషన్ సమస్య వస్తుందని హై టెన్షన్ తో కూడుకున్న కరెంటు ఉండడంతో గ్రామం నుండి కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తీసుకువెళ్లాలని ఫిర్యాదు చేసినట్లు రెండవది ఫర్టిలైజర్ యాప్ ద్వారా చిన్న రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ఈ యాప్ ద్వారా కాకుండా పట్టాదారు పాస్ బుక్ ద్వారా యూరియా పంపిణీ చేయాలని రైతులు ఫిర్యాదు చేశారు, మూడవ ఫిర్యాదు ఇందిరమ్మ ఇల్లు సాంగ్స్ చేసి 100 గజాల స్థలం కేటాయించాలని గ్రామస్తులు కోరారని తెలిపారు. ఎంపీ ఓ నరేష్ మాట్లాడుతూ వీటిని వెంటనే పరిష్కరించి ఆన్లైన్ ద్వారా కలెక్టర్ గారికి నివేదిక అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్వో జ్ఞాన జ్యోతి, ఎంపీ ఓ నరేష్, మండల స్థాయి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు



# బహుజన ఉద్యమ నాయకుడు డ్యాగల శ్రీనివాస్ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్న బి ఎస్ పి పార్టీ నాయకులు

- పరామర్శించిన పార్లమెంటు ఇంచార్జ్ బస్కే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షులు వనం మహేందర్

**నర్సంపేట టౌన్ ఆగస్టు 15 ప్రజాతీర్పు**

బహుజన ఉద్యమ నాయకుడు, బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు మరియు నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ను బహుజన్ సమాజ్ పార్టీ వరంగల్ పార్లమెంటు ఇంచార్జ్ బస్కే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షులు వనం మహేందర్ లు పార్టీ నాయకులతో కలిసి నర్సంపేట పట్టణంలోని తన నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా బిఎస్పి పార్టీ నాయకులు మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుడు, 2011 నుండి బీసీ ఉద్యమంలో అనునిత్యం అలుపెరుగని పోరాటం చేస్తున్న నాయకుడు అదేవిధంగా బహుజన వాదాన్ని వినిపించాలని 2020 నుండి 2023 వరకు నాలుగు సంవత్సరాలు బహుజన్ సమాజ్ పార్టీని నర్సంపేట నియోజకవర్గంలో గ్రామ గ్రామానికి తీసుకెళ్లిన బహుజన ఉద్యమ నాయకుడిగా పేరున్న నాయకుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ అని అన్నారు. కానీ దురదృష్టవశాత్తు ఇటివల కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో జరిగిన ఓబీసీ 11వ మహాసభ ల కార్యక్రమంలో భాగంగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోవడంతో గాయాలు కావడం జరిగిందని తెలియడంతో బహుజన ఉద్యమ నాయకుడు డ్యాగల శ్రీనివాస్ ను బిఎస్పి పార్టీ నాయకులము కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకోవడం జరిగిందని అన్నారు. డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ కోలుకుని బీసీ ఉద్యమంతో పాటు బహుజన ఉద్యమాలను నడిపించాలని ఆకాంక్షిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇంచార్జ్ బస్కే నాగరాజు, వరంగల్ జిల్లా అధ్యక్షులు వనం మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలెపాక శ్రీధర్, నర్సంపేట నియోజకవర్గ అధ్యక్షులు ఈసంపెల్లి గోవర్ధన్, ఉపాధ్యక్షుడు పోలెపాక లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిడి కార్మికులకు వృద్దులకు పెన్షన్ మంజూరు చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం

- కళ్యాణ్ లక్ష్మి షాది ముబారక్ పథకాల పథకాలు అందేలా అమలు చేయాలని

**బీర్పూర్ ఆగస్టు17 (ప్రజా తీర్పు )**



బీర్పూర్ మండలంలో బిడి కార్మికులు వృద్దులకు పెన్షన్ వెంటనే మంజూరు చేయాలని.కళ్యాణలక్ష్మి షాది ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు రావాల్సిన నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బి ఆర్ ఎస్ పార్టీ ఆద్వర్యంలో సోమవారం బీరు పూర్ మండలం ప్రజా వాణి లో వినతి పత్రం సమర్పించినా అనంతరం మాజీ ఎంపీపీ మసర్తి రమేష్ మాట్లాడుతూ బీడీ కార్మికులకు వృద్దులకు పెన్షన్ మంజూరు చేయడం లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించేకూడదన్నారు అలాగే కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ పథకాల కింద లబ్ధిదారులకు అందాల్సిన నిధులు తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు అనంతరం ప్రభుత్వానికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ప్రజావాణి లో అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ జేడ్పిటిసీ ముక్క శంకర్ మాజీ ప్రజాప్రతినిధులు యాదవ్ గుడిసె జీతెందర్ యాదవ్ షెర్పురి సుభాష్ఆడెపు యాదవ్ ఆడెపు తిరుపతి గంగాధర్ బర్ల లక్ష్మీ నారాయణ మార్కెట్ కమిటీ సభ్యులు ఏనుగు జోగి రెడ్డి నాయకులు చెట్ల శేఖర్ ముక్క ప్రవిణ్ యాదవ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

# జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న గౌడ్ పేరు పెట్టాలి

- తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్

**( ఎలుక భగవాన్ యాదవ్ ప్రజా తీర్పు ఎండపల్లి) ఆగస్టు 17:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా పేరు పెట్టాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ప్రచార కార్యదర్శి గాజుల శ్రీనివాస్ గౌడ్ ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి ఉత్సవాలు ఆగస్టు 18 నుంచి 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా గ్రామ గ్రామాన బడుగు, బలహీన వర్గాల వారంతా కలిసి నిర్వహించాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు.



## కూకట్ పల్లి జర్నలిస్ట్ లకు ఇండ్ల కేటాయింపుపై అడిషనల్ కలెక్టర్ కి వినతి

**కూకట్పల్లి, ఆగస్ట్ 17(ప్రజాతీర్పు)**

జర్నలిస్ట్ లకు ఇండ్ల కేటాయింపు, ఇండ్ల స్థలాలు కేటాయింపు లో నిష్పక్ష పాతంగా క్షేత్రస్థాయిలో విచారించి సీనియర్టీ పరంగా కేటాయింపు జరగాలని సీనియర్ జర్నలిస్టులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ కి వినతిపత్రం ఇవ్వడం. జరిగింది.

### సీనియారిటీ పరిగనణలోకి తీసుకుంటాం : అడిషనల్ కలెక్టర్

జరిగిన పరిణామాలు , జరుగుతున్న పరిణామాలు అన్ని అడిగి తెలుసుకున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ నిష్పక్ష పాతంగా పూర్తిగా పరిశీలించి కేటాయింపు జరిగేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమం లో సీనియర్ జర్నలిస్ట్ లు మండపాక కళ్యాణ్ చక్రవర్తి, దాదె వెంకట్, ఎమ్. ఎస్.ఆనంద్ రావు, బెల్లం శంకర్, అంబటి వెంకట్, ఎమ్. మహేశ్వర్ రెడ్డి, డి. విజయ్ పాల్గొన్నారు.




## ప్రజా సౌకర్యాలపై బీజేపీ పోరుబాట.. అధికారులకు వినతి

**(రాంపెల్లి చంద్రశేఖర్, ప్రజాతీర్పు తాండూర్) ఆగస్టు 17**

తాండూర్ మండలం రిపోర్టర్): తాండూర్ మండలంలోని బుధవారం కూరగాయల సంత వద్ద ప్రజల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తాండూర్ మండల శాఖ నాయకులు అధికారులను కోరారు. ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో భాగంగా మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో )శ్రీనివాస్, మండల తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతి బుధవారం నిర్వహించే కూరగాయల సంతకు తాండూర్ మండలంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు, వ్యాపారులు, కొనుగోలుదారులు తరలివస్తుంటారని బీజేపీ నాయకులు తెలిపారు. అయితే సంత ప్రాంగణంలో కనీసం మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు అవస్థలు పడుతున్నారని, వారి ఆత్మగౌరవాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా శనివారం జరిగే కూరగాయల సంత వద్ద ఇప్పటికే నిర్మాణంలో ఉన్న మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు, సీనియర్ నాయకులు పులగం తిరుపతి, యంగార్ తుకారం, జిల్లా కార్యవర్గ సభ్యుడు సిద్ధం మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ కామెర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధితుడికి 53వ సారి ప్లేట్‌లెట్స్ దానం

**కరీంనగర్, ఆగస్టు 17 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న బాధితుడికి అత్యవసర సమయంలో స్పందించి 53వసారి ప్లేట్‌లెట్స్ దానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు రక్తదాత వరికిల్ల దినేష్. కరీంనగర్ జిల్లా బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు ఆసుపత్రిలో సుల్తానాబాద్‌కు చెందిన ఓ క్యాన్సర్ బాధితుడు చికిత్స పొందుతున్నాడు. రక్తకణాల సంఖ్య 15 వేలకే పడిపోవడంతో అత్యవసరంగా బీ పాజిటివ్ సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్ అవసరమయ్యాయి. విషయం తెలుసుకున్న బొమ్మకల్ డివిజన్‌కు చెందిన జీపీవో పాశం కిషన్ సామూహిక రక్తదాత గాలిపెల్లి కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన కుమార్ తన మిత్రుడు, చిరంజీవి సీనియర్ అభిమాని వరికిల్ల దినేష్‌తో కలిసి చల్మెడ ఆసుపత్రికి చేరుకుని బీ పాజిటివ్ సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్‌ను 53వసారి దానం చేశారు. అనంతరం బాధితుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆసిరి ఆంజనేయులు, బాధితుడి కుటుంబ సభ్యులు, చల్మెడ ఆసుపత్రి యాజమాన్యం, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దినేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం అనంతరం దినేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత 65 సంవత్సరాల వరకు అర్హత మేరకు రక్తదానం చేయవచ్చని తెలిపారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని అన్నారు.

## ఘనంగా నాగుల పంచమి

**రామడుగు, ఆగస్టు 17 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



రామడుగు మండల కేంద్రంలో నాగుల పంచమి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా సోమవారం మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. రామడుగు మండల కేంద్రంలోని తాళ్ల వద్ద ఉన్న నాగదేవత విగ్రహానికి మహిళలు పాలు, నీళ్లు, పూలతో అభిషేకం చేసి పూజలు నిర్వహించారు. అనంతరం నాగదేవతకు మొక్కులు చెల్లించుకుని పుట్టలో పాలు పోసి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే రామడుగు మండల కేంద్రంలోని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద కూడా భక్తులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. నాగుల పంచమి సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

# ప్రభుత్వంపై భగ్గుమన్న బిఆర్ఎస్ నాయకులు

- సంక్షేమ పథకాలు కొనసాగించాలని నిరసన.
- కళ్యాణ లక్ష్మి తో పాటు తులం బంగారం అందించాలి.
- తహసిల్దార్ కు వినతి పత్రం అందించిన గులాబి నేతలు.

**జమ్మికుంట, ఆగస్టు 17 ప్రజాతీర్పు**



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ లాంటి సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని అలాంటి ప్రయత్నాలు ఉపసంహరించు కొని పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం మండిపడుతూ జమ్మికుంట తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేసి ఎమ్మార్వో కు వినతిపత్రం అందించిన బీఆర్ఎస్ శ్రేణులు. సోమవారం జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏ డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది టిఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై వ్యతిరేక నినాదాలు చేస్తూ సంక్షేమ పథకాల అమలు చేయాలని నిరసిస్తూ భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు, ప్రస్తుత మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కేడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్, పిఎసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్ లు మాట్లాడుతూ, ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తెలుగింటి ఆడబిడ్డల పెళ్లికి మేనమామ కట్నం కింద లక్ష రూపాయలను కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకం పేరుతో అందించి ఎంతో మంది కుటుంబాల్లో వెలుగులు నింపారని తెలిపారు. అలాంటి పథకాన్ని నిర్వీర్యం చేస్తూ ఆ పథకాలు తీసివేయాలన్న ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఇది దిక్కుమాలిన చర్యని వారు ఆరోపించారు. గత ఎన్నికల ముందు కళ్యాణ లక్ష్మి పథకం తో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు ఇచ్చిన హామీని నెరవేర్చుకోలేదని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని 420 హామీలు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆయన చిత్రపటాన్ని కాల్చివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సురేందర్రావు, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు వెంకటరెడ్డి, మాజీ కోఆప్షన్ మెంబర్ మహమ్మద్ రఫీ, కౌన్సిలర్లు పొన్నగంటి రాము, డాక్టర్ కేసురంజన్, వేణుగోపాలరావు తో పాటు నాయకులు మాజీ ఎంపీటీసీ తోట లక్ష్మణ్, మనోహర్ రావు, పర్లపెల్లి రమేష్ ,పాతకాల రమేష్, గాజుల భాస్కర్, బీసీ సంఘం మాజీ మండల అధ్యక్షుడు వజ్జపల్లి శ్రీనివాస్ ,బిట్ల రాజేందర్, రాచపల్లి వంశీ ,గరిగంటి శ్రీనివాస్ తో పాటు పలువురు టిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సహకార సొసైటీని సందర్శించిన అగ్రికల్చర్ విద్యార్థులు

- రైతులకు సొసైటీ అందిస్తున్న పథకాల పై విద్యార్థుల క్షేత్ర పరిశీలన
- రైతులకు అందిస్తున్న సేవలను వివరించిన పిఏసిఎస్ చైర్మన్.

**జమ్మికుంట, ఆగస్టు 17 ప్రజాతీర్పు**

చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ హైదరాబాద్ అగ్రికల్చర్ విద్యార్థులు సురేష్ జ్ఞాన విహార్ యూనివర్సిటీ అగ్రికల్చర్ విద్యార్థులు సోమవారం జమ్మికుంట పట్టణంలోని రైతు సహకార సంఘాన్ని సందర్శించారు. జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాజెక్టు వర్క్ నిర్వహిస్తున్న ఈ యూనివర్సిటీల అగ్రికల్చరల్ విద్యార్థులు రైతులకు సహకార సంఘం అందిస్తున్న సేవలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులకు పిఎసిఎస్ చైర్మన్ పొన్నగంటి సంపత్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి విద్యార్థుల కు సొసైటీ అందిస్తున్న సేవల గురించి పూర్తిగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రైతులకు సొసైటీ ద్వారా ఏ రకమైన సంక్షేమ పథకాలు అందిస్తారని వారికి సహకార సంఘం ద్వారా రుణాలు ఎలా ఇస్తారని పలు ప్రశ్నలు అడిగారు. దానికి స్పందించిన సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ, సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి రైతుకు ఒక ఎకరానికి 40 వేల రూపాయలను అప్పుగా ఇస్తామని అది కూడా 3 లక్షల వరకు మాత్రమే ఇస్తామని తెలిపారు. ఇచ్చిన అప్పు 6 నెలలకు చెల్లించాలని దానికి తక్కువ వడ్డీ ఉంటుందని ఒకవేళ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే రుణం మాఫీ అవుతుందని లేకపోతే తిరిగి చెల్లించాల్సి ఉంటుందని విద్యార్థులకు తెలిపారు. అంతేకాకుండా బంగారం తాకట్టు పెట్టుకొని కూడా రైతులకు అతీతక్కువవడ్డీకి రుణాలు అందిస్తామని ఇది కేవలం రైతు సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన సహకార సంఘం అని తెలిపారు. ఇవే కాకుండా రైతులకు సబ్సిడీ రేట్లపై ఎరువులు అందిస్తామని వాటితోపాటు ఐకెపి కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని సొసైటీ ఉంటుందని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు వారికి కృతజ్ఞతలు తెలిపి ఇలాంటి సహకార సంఘాల సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం వల్ల మాకు కొన్ని విషయాలు సులభంగా తెలుసుకోవడం జరుగుతుందని సొసైటీ చైర్మన్ పొన్నగంటి సంపత్ అందించిన సహకారం మరువలేనిది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు డి నవ్య, వి జోష్నా, ఎన్ మమత రెడ్డి, మనిషా ,హాజీరా, మనిష, గంగా, రేణుక, ప్రవళిక, సంధ్యారెడ్డి, తోపాటు సురేష్ విజ్ఞాన విహార్ యూనివర్సిటీ విద్యార్థులు కే స్నిగ్ధ, కే మోహన్, ప్రియదర్శిని, డి యేసు రాజ్యం, బి లహరి ,ఎస్ లిఖిత ,ఎం నాగ పూజిత, కల్పన ,పి నవ్య తదితరులు పాల్గొన్నారు.



## వందేమాతరం పట్ల కాంగ్రెస్ అగ్రనేతల వైఖరి అవమానకరం

- సోనియా గాంధీ, రాహుల్ దేశ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఆగస్టు 17**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా దేశ అత్యున్నత జాతీయ గేయమైన 'వందేమాతరం' ఆలాపన వేళ కాంగ్రెస్ అగ్రనేతలు ప్రదర్శించిన నిర్లక్ష్యం, గేయం పట్ల అవలంబించిన అవమానకర వైఖరిపై కరీంనగర్ బిజేవైఎం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. సోమవారం కరీంనగర్ కోర్టు చౌరస్తాలో భారతీయ జనతా యువ మోర్చా కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో వందేమాతరం సంపూర్ణ ఆలాపన జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించారని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు సంగ నరేష్ తీవ్రంగా మండిపడ్డారు. జాతీయ గేయం పట్ల కనీస గౌరవం ప్రదర్శించకపోగా, ఇతరులతో మాట్లాడుతూ ఆలాపనకు ఆటంకం కలిగించేలా ప్రవర్తించడం దేశ ప్రజల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని ఆయన ధ్వజమెత్తారు. ఈ నిరసన కార్యక్రమంలో బీజేవైఎం కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశభక్తిని చాటాల్సిన పవిత్ర వేదికపైనే జాతీయ గేయానికి అవమానం జరగడం క్షమించరాని నేరమని వారు ఆరోపించారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో అగ్రగణ్యమైన స్థానం ఉన్న వందేమాతరం గేయాన్ని అవమానించిన కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వెంటనే దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజేవైయం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి,బిజెపి జిల్లా నాయకులు గుజ్జ శ్రీనివాస్ రావు,బిజేవైయం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగంటి కుమార్, బిజేవైయం జిల్లా నాయకులు ఎడవెల్లి శశిధర్ రెడ్డి నక్క ప్రమోద్ గుర్రం వెంకటేశ్ గౌడ్ ఆకుల మనోహర్ సతీష్ తాడూరి కిరణ్ సుదమల్ల నాగరాజు రమేష్ యాదవ్ రాసబక్తుల వినయ్ గడ్డం సందీప్ జాగిరి రాజేందర్ కార్తిక్ శ్రీకర్ నవీన్ గణేష్ ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ నాయక్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ మరియు బిజేవైయం కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను పునరుద్ధరించాలి



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా బీఆర్ఎస్ సుజాతనగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో సుజాతనగర్ సెంటర్‌లో నల్లజెండాలు, నల్లబ్యాడ్జీలతో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లావుడ్య సత్యనారాయణ నాయక్, పార్టీ నాయకులు చింతలపూడి జగన్, పెద్దమల్ల నరేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం 2014లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేసీఆర్ పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ పథకాల ద్వారా రూ. 1,00,116 ఆర్థిక సహాయం అందించి నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ పథకాలను నీరుగార్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను వెంటనే పునరుద్ధరించి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని బీఆర్ఎస్ సుజాతనగర్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ బూరుగు ఇస్తారయ్య, మాజీ శివాలయం కమిటీ చైర్మన్ అన్నపురెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బానోత్ లక్ష్మణ్, ఆంగోత్ గంగా, చల్ది రవి, మాలోత్ ప్రసాద్, ఆంగోత్ లక్ష్మణ్, మాలోత్ రాందాస్, మాలోత్ కుమార్, జె. కుమార్, ఎస్.కె. బనగీర్ సాహెబ్, మా చిన్ని శ్రీకాంత్, రహీం, మండే చిన్న చంటి, ప్రదీప్, సంగు రాజేష్, కిషోర్, పులి వెంకటేష్, గడ్డం శ్రీను, కదిరి బాబు, ఆంగోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధారాల్లేని ఆరోపణలు సహించేది లేదు.. ఆర్.ఎస్. ప్రవీణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఫైర్..

- ప్రజల్లో ఉన్న నాయకుడు పై ఆరోపణలు చేస్తే ఊరుకోం.. తుంగతుర్తి రవి.
- వజ్రేష్ యాదవ్ పై ఆరోపణలు.. కాంగ్రెస్ నేతల తీవ్ర ఆగ్రహం.

**బోడుప్పల్ సర్కిల్, ఆగస్టు 17. ( ప్రజాతీర్పు )**



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌పై మాజీ ఐపీఎస్ అధికారి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ చేసిన ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. పీర్జాదిగూడలోని బండి కన్వెన్షన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఘాటుగా స్పందించారు. ఈ సందర్భంగా మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి మాట్లాడుతూ.. ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుడు వజ్రెష్ యాదవ్ అని అన్నారు. ఒకసారి ఉప సర్పంచ్‌గా, ఒకసారి సర్పంచ్‌గా ప్రజలకు సేవ చేసిన ఆయన.. ఎన్నికల్లో విజయాపజయాలతో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా భూకబ్జాల ఆరోపణలు చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆరోపణలు నిజమైతే వాటికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని తుంగతుర్తి రవి డిమాండ్ చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ప్రజా నాయకుడి ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. “ప్రజల్లో ఉంటూ ప్రజల కోసం పోరాడే నాయకుడి గురించి పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం కాదు.. ముందుగా ఆధారాలు చూపించాలి. ఆరోపణలు నిరూపించలేకపోతే వాటిని వెనక్కి తీసుకోవాలి” అని రవి స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు ప్రజాస్వామ్యంలో సహజమేనని, అయితే వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేయడం మాత్రం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ ఐపీఎస్ అధికారిగా పనిచేసిన వ్యక్తి ఏదైనా ఆరోపణ చేస్తే దానికి తగిన ఆధారాలు కూడా చూపించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జలెందర్ రెడ్డి, పోచారం డివిజన్ అధ్యక్షుడు కర్రె రాజేష్, పీర్జాదిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి శ్రీరాములు, దర్గా దయాకర్ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, ఎన్ ఎన్ కే దుర్గ, తండా పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# తోట సత్యం ఆర్థిక చేయూత

## మహిళకు రూ.10 వేల ఆర్థిక సాయం

**రామడుగు, ఆగస్టు 17 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి ఎన్నారై తోట సత్యం ఆర్థిక చేయూత అందించారు. రామడుగు మండల కేంద్రానికి చెందిన అనుపురం లక్ష్మి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం ఆమె కుటుంబ సభ్యులు అనుపురం లావణ్య, శ్రీనివాస్ ద్వారా తోట సత్యం దృష్టికి తీసుకెళ్లారు. లక్ష్మి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న తోట సత్యం మానవతా దృక్పథంతో స్పందించి, తన సూచన మేరకు నాగి శేఖర్, సముద్రాల శ్రీనివాస్‌ల ద్వారా రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆపద సమయంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన తోట సత్యానికి లక్ష్మి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని పలువురు పేర్కొన్నారు.

# నీట్ లాంగ్‌టర్మ్ ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**మంథని, ఆగస్టు-17 (ప్రజాతీర్పు)**



తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే లాంగ్‌టర్మ్ నీట్ శిక్షణకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పెద్దపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి ఊటూరి శ్రీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు, బాలికలకు వంద చొప్పున సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ ఫౌండేషన్ సిఓఇ చిలుకూరులో బాలురకు, మహేంద్రహిల్స్ ఫౌండేషన్ సిఓఇ లో బాలికలకు ఉచిత నీట్ శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ బైపిసి ఉత్తీర్ణులై, నీట్-2026 పరీక్ష రాసిన ఎస్సీ, ఎస్టీ, ఓబిసి, ఈడబ్ల్యూఎస్ కేటగిరీల విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఈ నెల 22 లోపు సంబంధిత ష్ట్రజూం:ౕ/స్త్రంషతీవఅర్.వశ్రీఖఅస్త్రుఖ్ణు.స్త్రశీజ.ఱఅ/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుకు ఎలాంటి ఫీజు అవసరం లేదని పేర్కొన్నారు. దరఖాస్తు అనంతరం ధ్రువపత్రాలను జతచేసి, దరఖాస్తు పత్రాన్ని పెద్దపల్లి జిల్లా డిసిఓ కేంద్రంగా ఉన్న మంథని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల జూనియర్ కళాశాల బాలురులో పనివేళల్లో అందజేయాలని సూచించారు.




# బీర్పూర్ మండలంలోని ప్రజావాణి కార్యక్రమం

## ప్రజల సమస్యల పరిష్కారానికి వినతిపత్రాల స్వీకరణ

**బీర్పూర్ ఆగస్టు 17 (ప్రజా తీర్పు )**

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానికమండల రైతు వేదిక సోమవారం ప్రజావాణి రైతు వేదికకార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో తహసీల్దార్ సంయుక్తంగా కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. 1భూ సమస్యలు, 2భూమి ఆక్రమణ తొలగింపు 3 అమ్మ ఆదర్శ పాఠశాల పనుల అమౌంట్ విడుదల కొరకు 4 ఇందిరమ్మ ఇల్లు కాప్చర్ 5 కోమన్ పల్లి అంగన్వాడీ టీచర్ నోటిఫికేషన్ రిజర్వేషన్ మార్చమని 6 గుడుంబా అరికట్టమని 7 డ్రైనేజి సమస్య 8 బీర్పూర్ చెరువు కి తూము ఏర్పాటు కొనసాగాలప్రభుత్వ పథకాలు, పెన్షన్లు, మౌలిక వసతులు తదితర సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి అందిన వినతిపత్రాలను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు.



# న్యాయం కోసం నాలుగోసారి ప్రజావాణిలో ఫిర్యాదు

- పొలం ఆక్రమణకు గురైందని బాధితుడి ఆవేదన

**జుక్కల్, ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**

కామారెడ్డి జిల్లా మద్నూర్ 1990 సంవత్సరంలో కొనుగోలు చేసిన తొమ్మిది గుంటల భూమిలో గత 36 ఏండ్లుగా వ్యవసాయం చేసుకుంటున్నామనీ, మా భూమిని స్తానిక సురేష్ గౌడ్ అతని తమ్ముళ్లు కలిసి దౌర్జన్యంగా గెట్లను తొలగించి, కబ్జాకు పాల్పడ్డారని సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదుదారుడు సందూర్ వార్ హనుమండ్లు నాలుగోసారి వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుడు మాట్లాడుతూ.. మద్నూర్ గ్రామ శివారు పరిధిలోని మైసమ్మ చెరువు కింద తన 9 గుంటల పొలం ఆక్రమణకు గురైందని ఆవేదన చెందారు. ఇప్పటికీ మూడుసార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని, దీని గురించి అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. న్యాయం కోసం నేడు నాలుగోసారి 22 శాఖల అధికారుల సమక్ష?ంలో జరుగుతున్న ప్రజావాణిలో మళ్ళీ ఫిర్యాదు చేశామనీ, ఇప్పటికైనా అధికారులు తమ సమస్యపై దృష్టి సారించి, న్యాయం చేయాలనీ వేడుకున్నారు. లేనియెడల కుటుంబ సమేతంగా న్యాయం కోసం నిరాహార దీక్ష చేపడతామనీ పేర్కొన్నారు.



# చెరువు మట్టితో రోడ్డు బేస్‌నా?

- రహదారి పనుల్లో నాణ్యతపై సర్పంచ్ లావుడ్య పూర్ణ ఆగ్రహం

**(జక్కుల ఫాల్గుణ, భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాతీర్పు) ఆగస్టు 17**

లక్ష్మీదేవిపల్లి: రేగళ్ల నుంచి కరకవాగు వరకు ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.10 కోట్లతో చేపడుతున్న బీటీ రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని రేగళ్ల పెద్దతండా సర్పంచ్ లావుడ్య పూర్ణ ఆరోపించారు. ప్రజా దర్బార్‌లో అధికారులను నిలదీసిన ఆమె.. రహదారి షోల్డర్ల కింద చెరువు మట్టిని పెద్దఎత్తున వినియోగించి, పైభాగంలో మాత్రమే ఎర్ర మట్టి వేస్తున్నారని పేర్కొన్నారు. బేస్‌నే బలహీనంగా నిర్మిస్తే వర్షాలకు మట్టి కుంగిపోయి రహదారి దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పనుల్లో ఉపయోగిస్తున్న మట్టి నాణ్యతను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైతే నమూనాలను పరీక్షలకు పంపించాలని డిమాండ్ చేశారు. నాణ్యతకు విరుద్ధంగా ఉన్న మెటీరియల్‌ను తొలగించి నిబంధనల ప్రకా రం రహదారి బేస్‌ను పటిష్టంగా నిర్మించాలని కోరారు. గతంలో జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పనుల తీరులో మార్పు రాలేదని సర్పంచ్ ఆరోపించారు. ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యత లోపిస్తే భవిష్యత్తులో మళ్లీ ప్రభుత్వ నిధులతో మరమ్మతులు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అలాగే పెద్దతండా, రేగళ్ల ఎస్సీ కాలనీతో పాటు గిరిజన, హరిజన వాడల్లో రహదారికి ఇరువైపులా సీసీ డ్రైన్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఒకవైపు మాత్రమే డ్రైన్లు నిర్మిస్తున్నారని, వర్షపు నీరు సక్రమంగా వెళ్లేలా ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రేగళ్ల--కరకవాగు రహదారి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మట్టి నాణ్యతను పరీక్షించాలని సర్పంచ్ లావుడ్య పూర్ణ డిమాండ్ చేశారు.



# కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు కొనసాగించాలని బీఆర్ఎస్ ధర్నా

**(రాంపెల్లి చంద్రశేఖర్ ప్రజా తీర్పు, తాండూర్ మండల రిపోర్టర్) ఆగస్టు 17**

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించడంతో పాటు అర్హులైన లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ తాండూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. మండల అధ్యక్షుడు సుబ్బా దత్తుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు స్టే పేరుతో జాప్యం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల సాధన కోసం ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రం నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ప్రజా ఫిర్యాదుల విభాగంలో భాగంగా ఎంపీడీవో శ్రీనివాస్, మండల తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుబ్బా దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ మాసాడి శ్రీరాములు, శ్రీదేవి, ప్రణయ్ కుమార్, మాజీ ఎంపీటీసీ రాజన్న, శంకర్, పార్టీ సీనియర్ నాయకులు ఎలుక రామచందర్, పురుషోత్తం గౌడ్, చంద్రశేఖర్, నిరంజన్, మద్దిబోయిన అర్జున్, గట్టు సంతోష్, జాడి పోశం, లక్ష్మీనారాయణ, రాజేందర్, బోడ సతీష్, బాబు ఖాన్, రాము, బండి సంతోష్, మహేష్, ఉప్పుట్ల సంతోష్, సూర్యకిరణ్, సారయ్య, రాకేష్, ప్రశాంత్‌తో పాటు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా తహసిల్దార్ ఎండి ముజీబ్ జన్మదిన వేడుకలు

**మద్నూర్, ఆగస్టు 17, (ప్రజా తీర్పు)**

కామారెడ్డి జిల్లా మద్నూర్ స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎండి ముజీబ్ జన్మదిన వేడుకలను సోమవారం కార్యాలయ సిబ్బంది అత్యంత కోలాహలంగా నిర్వహించారు.డిప్యూటీ తహసిల్దార్, ఆర్ఐలు, జీపీఓలు కార్యాలయ సిబ్బంది. జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో సిబ్బంది సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది తాసిల్దారును స్వీట్లు తినిపించు స్వీట్లు పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా తహసిల్దార్ ఎండి ముజీబ్ మాట్లాడుతూ...సిబ్బంది చూపించిన అభిమానానికి, ఆప్యాయతకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, రెవెన్యూ సేవలను వేగవంతంగా అందించడంలో సిబ్బంది అందరూ ఇదే రకమైన సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.?ఈ కార్యక్రమంలోసూపరింటెండెంట్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శశిరేఖ మృతికి సీపీఎం ఘన నివాళి

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 17 (ప్రజా తీర్పు)**



సుజాతనగర్: మండలంలోని సింగభూపాలెం గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరులు రాసాల హనుమంతు, రాసాల గురవయ్యల తల్లి రాసాల శశిరేఖ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె భౌతికకాయానికి సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు నర్రా శివరామకృష్ణ, సీపీఎం సీనియర్ నాయకులు, మండల కమిటీ సభ్యులు చప్పిడి వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ.. శశిరేఖ సీపీఎం సానుభూతిపరురాలిగా పార్టీకి మద్దతుగా నిలిచారని తెలిపారు. ఆమె కుమారులు రాసాల హనుమంతు, రాసాల గురవయ్య కూడా సీపీఎం సానుభూతిపరులుగా ఈ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములయ్యారని పేర్కొన్నారు. శశిరేఖ కుటుంబానికి సీపీఎం మండల కమిటీ తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, సీపీఎం సీనియర్ నాయకులు చింతల శ్రీనివాసరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు బచ్చలకూర శ్రీనివాస్, కొండ కృష్ణ, మండల కమిటీ సభ్యులు నల్లగొప్పు పుల్లయ్య, బాలు వెంకటేశ్వర్లు, భూక్య శంకర్, వీర్ల మల్లేష్, వీర్ల ముత్తయ్య, హమాలీ సీనియర్ నాయకులు ఎస్కే బాబా, ధర్మారావు, నరసింహారావు, వీర్ల వసంత, గడ్డం రాజశేఖర్, గరిక హనుమంతు పాల్గొన్నారు.

# పోలీస్ గ్రీవెన్స్ డేలో బాధితుల పిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) ఆగస్టు 17**



సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పి నరసింహ ఐపీఎస్ పిర్యాదుదారుల నుండి వినతులు స్వీకరించారు. జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితులు వివిధ సమస్యలపై ఫిర్యాదులకు సంబంధించి బాధితులు ఎస్పి గారిని ప్రత్యక్షంగా కలిసి వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్పి గారు ప్రతి ఒక్క బాధితుడి సమస్యను విని, వాటి పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకునేలా సంబంధిత పోలీస్ అధికారులుతో ఫోన్ ద్వారా మాట్లాడి అవసరమైన సూచనలు జారీ చేశారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా, వారి సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలనే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఎస్పి గారు తెలిపారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఫిర్యాదును పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020